# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 325, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) గురువారం - 06 - ఫిబ్రవరి - 2025


## కేంద్రమంత్రి కుమారస్వామికి మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు



- కేంద్రమంత్రి కుమారస్వామిని కలిసిన మంత్రి లోకేశ్
- మాజీ ప్రధాని దేవగౌడ ఆశీస్సులు తీసుకున్న లోకేశ్
- విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.12వేల కోట్ల నిధులు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు

అమరావతి : కేంద్ర భారీపరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## గొంగడి త్రిషకు తెలంగాణ సర్కారు భారీ నజరానా



2లో

హైదరాబాద్ : భారత యువ క్రికెటర్ గొంగడి త్రిష కు తెలంగాణ సర్కారు భారీ నజరానా ప్రకటించింది. అండర్-19 టీ20 ప్రపంచకప్-2025లో సత్తా చాటిన ఈ ఆల్‌రౌండర్‌కు కోటి రూపాయల నజరానా ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. భవిష్యత్తులో త్రిష మరింత గొప్పగా రాణించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

వారికి పది లక్షల చొప్పున - త్రిషకు కోటి రూపాయల బహుమతిని ప్రకటించడంతో పాటు భారత జట్టు సభ్యురాలు, తెలంగాణకు చెందిన ధృతి కేసరికి 10 లక్షల రూపాయల నజరానాను ప్రభుత్వం ప్రకటించింది. అదే విధంగా.. జట్టు హెడ్ కోచ్ నౌషీన్ అల్ ఖదీర్, ట్రైనర్ షాలినికి 10 లక్షల చొప్పున బహుమతిని ప్రకటించారు. కాగా ఇటీవల ముగిసిన ఐసీసీ మహిళల అండర్%-%19 వరల్డ్ కప్ లో త్రిష అద్భుత ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. తన ఆల్‌రౌండ్ ప్రతిభతో భారత్‌ను విజేతగా నిలపడంలో కీలక పాత్ర పోషించింది ఈ యువ తార. ఈ మెగా ఈవెంట్లో ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగిన త్రిష.. టోర్నమెంట్ చరిత్రలోనే మిగతా..2లో

## గత దశాబ్దంలో మొబైల్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం ఎలా మారిపోయిందో తెలుసా..?

### 'మేక్ ఇన్ ఇండియా' క్యాంపెయిన్ తో పదేళ్లుగా ఎన్నో ఆవిష్కరణలకు నాంది

- గత దశాబ్దంలో భారతదేశ మొబైల్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం ఎలా మారిపోయిందో ఒకసారి చూడండి
- 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాల కింద దేశంలో ఉత్పత్తి భారీగా పెరిగింది
- బొమ్మలు, రక్షణ పరికరాలు, ఎలక్ట్రిక్ వాహన మోటార్ల ఉత్పత్తిలో కూడా స్వావలంబన వైపు పయనిస్తోంది
- 'మేక్ ఇన్ ఇండి యా' కార్యక్రమం కింద అనేక భాగాలు ఇప్పుడు భారతదేశంలో తయారు చేయబడుతున్నాయని మంత్రి వైష్ణవ్





వివరాలు 2లో..

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా మొబైల్ తయారీ రంగంలో గత 10 సంవత్సరాలలో ప్రభుత్వం ఎంతవరకు పురోగతి సాధించిందో వివరించారు

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా నినాదంతో దూసుకెళ్తోంది.. 'మేక్ ఇన్ ఇండియా' క్యాంపెయిన్ తో పదేళ్లుగా ఎన్నో ఆవిష్కరణలకు నాంది పలకడంతో పాటు.. ఎంతో వృద్ధిని సాధించింది.. అయితే.. గత దశాబ్దంలో భారత దేశంలో మొబైల్, ఎల క్ట్రానిక్స్ తయారీ రంగం గణనీయంగా వృద్ధి చెందింది. గతంతో పోలిస్తే.. ఎంతో వృద్ధిని సాధించామని.. మిగతా..2లో

## భారత్ చేరుకున్న వలసదారుల విమానం



2

అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ సర్కార్
చట్టవిరుద్ధంగా దేశంలో ఉంటున్న భారతీయులను వెనక్కి పంపిన అమెరికా
205 మంది భారతీయులతో టెక్సాస్ నుంచి అమృత్‌సర్ చేరుకున్న విమానం

## పాక్ ఆక్రమిత కశ్మీర్ లో అడుగుపెట్టనున్న హమాస్.. అలర్ట్ అయిన ఇంటెలిజెన్స్



2

పీవోకేలో కశ్మీర్ సంఘీభావ దినోత్సవం కార్యక్రమానికి హాజరవుతున్న హమాస్ నేత
హైలెవెల్ మీటింగ్ నిర్వహించిన అమిత్ షా

## గాజాకు సంబంధించి 3 లక్ష్యాలు నిర్దేశించుకున్నాం :ట్రంప్ తో భేటీ తర్వాత నెతన్యాహు ప్రకటన



2

ట్రంప్ తో భేటీ అయిన నెతన్యాహు
హమాస్ సైన్యాన్ని నాశనం చేయడమే లక్ష్యమన్న ఇజ్రాయెల్ ప్రధాని
ట్రంప్ తనకు గొప్ప స్నేహితుడని కితాబు

# ఇకపై తెలుగులోనే జీవోలు..

# చంద్రబాబు ప్రభుత్వ కీలక నిర్ణయం

### ప్రతి జీవో ప్రజలు తెలుసుకునేలా పబ్లిక్ డొమైన్ లో...

- అప్పటి హామీని సీఎం హెూదాలో చంద్రబాబు నెరవేర్చారు.
- ఏపీ ప్రభుత్వం తెలుగుకు వెలుగు వచ్చేలా ఇక పై మాతృభాషలో ప్రభుత్వ ఆదేశాలు
- ఆంగ్ల ప్రభావంతో తెలుగు భాష మనుగడ ప్రమాదంలో పడిందనే ఆందోళనలు
- ఫలించిన బాబు కృషి గత ప్రభుత్వంలో ఎక్కువగా జీవోలను రహస్యంగా జారీ చేసేవారని ఆరోపణలు
- ప్రస్తుతం ఇంగ్లీషులో జీవోలు వస్తుండటం వల్ల 90 శాతం మంది అర్థం చేసుకోలేకపోతున్నారు



అమరావతి : తెలుగు భాషపై తన మమకారం చూపుతోంది ఏపీ ప్రభుత్వం తెలుగుకు వెలుగు వచ్చేలా ఇక పై మాతృభాషలో ప్రభుత్వ ఆదేశాలు (జీవో)ను వెలువరించనుంది. బుధవారం తొలి తెలుగు జీవోను విడుదల చేసింది. తెలుగు భాషాభివృద్ధికి ఉపయోగపడేలా చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై భాషాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. / దేశ భాష లందు తెలుగు లెస్స అంటూ ఎప్పుడో రాయలువారి కాలంలోనే మన మాతృభాష అధికార భాషగా వర్ధిల్లింది. అయితే కాలక్రమంలో ఆంగ్ల ప్రభావంతో తెలుగు భాష మనుగడ ప్రమాదంలో పడిందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఇక గత ప్రభుత్వంలో మిగతా..2లో

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో మంత్రి నారా లోకేశ్ భేటీ



2లో

ఏపీలో ఎడ్యుకేషన్ మినిస్టర్స్ కాంక్లేవ్ కు అవకాశం కల్పించాలని వినతి
పీఎం శ్రీ పథకంలో మరో 1,514 పాఠశాలలకు అవకాశం ఇవ్వాలంటూ విజ్ఞప్తి
పూర్వోదయ పథకం కింద రూ. 5,684 కోట్లు మంజూరు చేయాలని అభ్యర్థన

## తనకు కేసీఆర్ ఫోన్ చేశారనే వార్తలపై ఈటల రాజేందర్ స్పందన



2

- ఈటలను మళ్లీ బీఆర్ఎస్ లోకి రావాలని కేసీఆర్ పిలిచారంటూ ప్రచారం
- తనంటే గిట్టని వాళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న ఈటల
- తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తన లక్ష్యమని వ్యాఖ్య

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అందరి చూపూ ఆ ఐదు స్థానాలపైనే..!



2

- న్యూఢిల్లీ నుంచి మాజీ సీఎం కేజ్రీవాల్ పోటీ
- కల్కాజీ బరిలో బీజేపీ నుంచి రమేశ్ బిధూరి, ఆప్ నుంచి సీఎం అతిశీ
- జంగ్ పుర నియోజకవర్గంలో పోటీ పడుతున్న మనీశ్ సిసోడియా

## జంప్ జిలానీలకు కొత్త టెన్షన్..!

## కేటీఆర్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఏమన్నారంటే..

- కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ
- బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుపై లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలన్నారు.
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు శాసనసభ కార్యదర్శి
- కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడే వరకు తమ పోరాటం ఆగదు: -కేటీఆర్
- ఎమ్మెల్యేలకు నోటీసులు ప్రొసీజర్‌లో భాగమేనన్నారు రేవంత్ రెడ్డి




హైదరాబాద్ : బీఆర్ఎస్ కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ కుమార్, ప్రకాశ్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీకి నోటీసులు ఇచ్చారు. బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుపై లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలన్నారు.

## తీన్మార్ మల్లన్న మా పార్టీనా, కాదా నిర్ణయించుకోవాలి: సీతక్క ఆగ్రహం



2లో

తీన్మార్ మల్లన్న గెలుపు కోసం చాలా కష్టపడ్డామన్న సీతక్క
పార్టీలో ఉన్నప్పుడు పార్టీ లైన్‌లో మాట్లాడాలని సూచన
కుల గణన నివేదికకు నిప్పు పెట్టడం దారుణమన్న మంత్రి

హైదరాబాద్ : సొంత పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై తెలంగాణ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. తీన్మార్ మల్లన్న తమ పార్టీకి చెందిన వారో కాదో ఆయనే నిర్ణయించుకోవాలని ఆమె అన్నారు.

# కేంద్రమంత్రి కుమారస్వామికి మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు

మొదటి పేజి తరువాయి

అక్కడే ఉన్న ఆయన తండ్రి, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడను కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుజ్జీవనానికి సుమారు రూ.12వేల కోట్ల నిధులు విడుదల చేసినందుకు కుమారస్వామికి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ ప్రజల సెంటిమెంట్ తో పాటు వేలాదిమంది కార్మికుల ఆందోళన, మనోభావాలను అర్థం చేసుకుని పెద్దమనసుతో సహకారం అందించారని కొనియాడారు. స్టీల్ ప్లాంట్ ను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయడం, ఉత్పాదకత పెంపుదలకు చర్యలు చేపట్టడం, కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకోవడంలో మీ చొరవ శ్లాఘనీయమని అన్నారు. అనకాపల్లి వద్ద ప్రైవేటురంగంలో ఏర్పాటుకానున్న ఆర్సెలర్స్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్స్ ఉక్కు పరిశ్రమ వల్ల ఏపీ యువతకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం తరపున అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు.

# గొంగడి త్రిషకు తెలంగాణ సర్కారు భారీ నజరానా

మొదటి పేజి తరువాయి

తొలి శతకంతో సత్తా చాటి ప్రపంచ రికార్డుతో మెరిసింది. లీగ్ దశలో భాగంగా స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో ఈ ఓపెనింగ్ బ్యాటర్ కేవలం 53 బంతుల్లోనే వంద పరుగుల మార్కు అందుకుంది. త్రిష ఇన్నింగ్స్‌లో పన్నెండు ఫోర్లతో పాటు.. నాలుగు సిక్సర్లు ఉండటం విశేషం. ఇక టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించిన త్రిష మొత్తంగా 309 పరుగులు చేసింది. అంతేకాదు.. ఈ లెగ్‌స్పిన్నర్ ఏడు వికెట్లు కూడా తన ఖాతాలో వేసుకుంది. ఇక సౌతాఫ్రికాతో ఫైనల్లో 33 బంతుల్లో 44 పరుగులతో అజేయంగా నిలిచిన గొంగడి త్రిష.. మూడు వికెట్లతో మెరిసి భారత్ వరుసగా రెండోసారి చాంపియన్‌గా నిలవడంలో కీలకంగా మారింది. ఈ క్రమంలో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును కూడా త్రిష సొంతం చేసుకుంది. అంతేకాదు.. ఐసీసీ 'టీమ్ ఆఫ్ ద టోర్నీ'లో నూ ఈ తెలుగుతేజానికి చోటు దక్కడం మరో విశేషం.

భద్రాద్రి అమ్మాయి -:-కాగా తెలంగాణలోని భద్రాద్రికి చెందిన త్రిషకు చిన్ననాటి నుంచే క్రికెట్ మీద మక్కువ. త్రిష ఈ స్థాయికి చేరడంలో ఆమె తండ్రి రామిరెడ్డిది ప్రధాన పాత్ర. కుమార్తె కోసం ఆయన ఎన్నో కష్టనష్టాలకోర్చి.. తన గారాలపట్టిని క్రికెటర్‌గా తీర్చిదిద్దారు. అందుకే తాను సాధించిన ప్రతి గొప్ప విజయానికి తండ్రికే అంకితం చేస్తుంది ఈ బంగారుతల్లి.

ఘన స్వాగతం -: మలేషియాలో ఐసీసీ టోర్నీ గెంచుకున్న త్రిష మంగళవారమే హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అరశనపల్లి జగన్‌మోహన్ రావు ఘన స్వాగతం పలికారు. త్రిషతో పాటు భారత జట్టులో సభ్యురాలైన కేసరి ధృతి, టీమ్ హెడ్ కోచ్ నూషీన్ అల్ ఖదీర్, ట్రెయినర్ షాలిని కూడా నగరానికి చేరుకున్నారు. ఈ నలుగురినీ జగన్‌మోహన్ రావు సన్మానించారు. 19 ఏళ్ల త్రిష తన అద్భుత ఆటతీరుతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేసిందని ఆయన ప్రశంసించారు. త్రిష, ధృతిలను ఆదర్శంగా తీసుకొని మరింత మంది అమ్మాయిలు అంతర్జాతీయస్థాయికి ఎదగాలని జగన్‌మోహన్ రావు ఆకాంక్షించారు. హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి వీరికి నగదు బహుమతిని ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. హెడ్ కోచ్‌గా నూషీన్ అల్ ఖదీర్‌కు, ప్లేయర్‌గా త్రిషకు ఇది వరుసగా రెండో వరల్డ్‌కప్ టైటిల్ కావడం విశేషం. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి అండర్%-%19 టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టుకు భారత మాజీ స్పిన్నర్ నూషీన్ హెడ్ కోచ్‌గా వ్యవహరించగా... త్రిష సభ్యురాలిగా ఉంది. 2025లోనూ నూషీన్ హెడ్ కోచ్‌గా కొనసాగగా... నిలకడగా రాణించిన త్రిష 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డును సాధించింది. కేసరి ధృతి కూడా విజేత జట్టులో సభ్యురాలిగా ఉన్నా ఆమెకు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాలేదు.

# భారత్ చేరుకున్న వలసదారుల విమానం

న్యూఢిల్లీ : అగ్రరాజ్యం అమెరికాలో కొత్తగా ఏర్పాటైన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతోంది. అక్రమ వలసదారులపై మొదటి నుంచి కఠినంగా ఉంటున్న ట్రంప్.. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలో కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. సరైన ధ్రువపత్రాలు లేకుండా, చట్టవిరుద్ధంగా తమ దేశంలోకి అడుగుపెట్టిన భారత పౌరులను ప్రత్యేక విమానంలో స్వదేశానికి పంపింది. దాంతో 205 మంది భారతీయులతో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా సైనిక విమానం సీ-17 ఈరోజు మధ్యాహ్నం అమృత్‌సర్‌లోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయింది. కాగా, ప్రత్యేక విమానంలో స్వదేశానికి వచ్చిన వారంతా పంజాబ్, దాని చుట్టుపక్కల రాష్ట్రాలకు చెందినవారని సమాచారం. అవసరమైన సోదాల అనంతరం వారిని విమానాశ్రయం నుంచి బయటకు పంపనున్నట్లు తెలుస్తోంది. ఇక రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు.ఇదిలాఉంటే... యూఎస్ హోంలాండ్ అధికారుల గణాంకాల ప్రకారం 20,407 మంది ఇండియన్స్ వద్ద సరైన ధ్రువపత్రాలు లేనట్లు తేలింది. వీరిలో 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఈఆర్ఓ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రిమూవల్ ఆపరేషన్స్) నిర్బంధంలో ఉన్నారు. మొదటి విడతలో భాగంగా 205 మందిని వెనక్కి పంపించారు.


## పాక్ ఆక్రమిత కశ్మీర్ లో అడుగుపెట్టనున్న హమాస్..

# అలర్ట్ అయిన ఇంటెలిజెన్స్

న్యూఢిల్లీ : పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ పాక్ ఆక్రమిత కశ్మీర్ లో అడుగుపెడుతోందనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ క్రమంలో భారత ఇంటెలిజెన్స్ వర్గాలు పూర్తిగా అప్రమత్తమయ్యాయి. కశ్మీర్ సంఘీభావ దినోత్సవంలో భాగంగా ఈరోజు పీవోకేలో 'అల్ అక్సా ఫ్లడ్స్' పేరుతో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో హమాస్ కు చెందిన సీనియర్ నేత ప్రసంగించనున్నట్టు ప్రచారం జరుగుతోంది. రావల్కోట్ లోని సబీర్ స్టేడియంలో జరగనున్న ఈ కార్యక్రమంలో జైషే మొహమ్మద్, లష్కరే తోయిబా సంస్థల సీనియర్ నేతలు కూడా పాల్గొనబోతున్నారు. ఈ కార్యక్రమంలో హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దౌమి ప్రసంగిస్తారని కరపత్రాలు, ఇతర మార్గాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. కశ్మీర్ లో పోరాటాన్ని పాలస్తీనాతో ముడిపెట్టి ఆయన మాట్లాడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే అంశంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిన్న జమ్మూకశ్మీర్ పై హైలెవెల్ మీటింగ్ ను నిర్వహించారు. కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. కశ్మీర్ లో వాహన తనిఖీలను తీవ్రతరం చేయాలని ఆదేశించారు. 2024 ఆగస్టులో ఖతార్ రాజధాని దోహాలో హమాస్ నేతలతో లష్కరే తోయిబా ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ భేటీ అయ్యాడు. 2018లోనే ఆయనను ఉగ్రవాదుల జాబితాలో అమెరికా చేర్చింది. లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కు ఖలీద్ సన్నిహితుడు.

## గాజాకు సంబంధించి 3 లక్ష్యాలు నిర్దేశించుకున్నాం

# :ట్రంప్ తో భేటీ తర్వాత నెతన్యాహు ప్రకటన



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భేటీ అయిన సంగతి తెలిసిందే. సమావేశం అనంతరం నెతన్యాహు మాట్లాడుతూ... హమాస్ తో యుద్ధం తర్వాత ఇజ్రాయెల్ మరింత బలంగా మారిందని చెప్పారు. తమ దేశంలో శాంతిని నెలకొల్పడానికి, ప్రజలకు సురక్షితమైన భవిష్యత్తును అందించడం కోసం గాజాకు సంబంధించి మూడు కీలక లక్ష్యాలను నిర్దేశించుకున్నామని తెలిపారు.

మూడు లక్ష్యాలు:

బందీలను విడుదల చేయడం, హమాస్ సైన్యాన్ని నాశనం చేయడం, తమ దేశానికి గాజా మరోసారి ముప్పు కల్పించకుండా చూసుకోవడం తాము నిర్దేశించుకున్న మూడు లక్ష్యాలని నెతన్యాహు తెలిపారు. మెరికాకు ఇప్పటి వరకు ఉన్న అధ్యక్షులలో ట్రంప్ తనకు గొప్ప మిత్రుడని నెతన్యాహు కొనియాడారు. యూఎస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి విదేశీ నేతగా తనను వైట్ హౌస్ కు ఆహ్వానించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రెండు దేశాల మధ్య మైత్రికి ఇది నిదర్శనమని చెప్పారు. అందుకే ఇజ్రాయెల్ ప్రజలు ట్రంప్ ను అమితంగా ఇష్టపడతారని తెలిపారు. యుద్ధాన్ని ఆపడానికి ట్రంప్ తన పరిధిని దాటి ప్రయత్నిస్తున్నారని నెతన్యాహు అన్నారు. తమ లక్ష్యాలను చేరుకోవడానికి అది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మరోవైపు, ట్రంప్ మాట్లాడుతూ గాజా స్ట్రిప్ ను స్వాధీనం చేసుకుంటామని సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

# గత దశాబ్దంలో మొబైల్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం ఎలా మారిపోయిందో తెలుసా..?

మొదటి పేజి తరువాయి






గత దశాబ్దం లో భారతదేశ మొబైల్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం ఎలా మారిపోయిందో ఒకసారి చూడండి.. అంటూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా మొబైల్ తయారీ రంగంలో గత 10 సంవత్సరాలలో ప్రభుత్వం ఎంతవరకు పురోగతి సాధించిందో వివరించారు. దీనితో పాటు, ఎగు మతి రంగంలో పురోగతిపై ఆయన అనేక గణాం కాలను కూడా పంచుకున్నారు. 2014 సంవత్స రంలో దేశంలో కేవలం 2 మొబైల్ తయారీ యూనిట్లు మాత్రమే ఉండగా, నేడు ఆ సంఖ్య 300 దాటిందని మంత్రి అన్నారు. దీనితో పాటు, ఈ రంగంలో పెట్టుబడి, ఉత్పత్తిలో భారీ పెరుగుదల ఉందని వివరించారు. దీని కారణంగా భారతదేశం నేడు ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీలో అగ్రగామిగా ఎదుగుతోందన్నారు.

పదేళ్లలో ఎగుమతుల్లో భారీ పెరుగుదల..

2014లో మొబైల్ ఫోన్ తయారీ విలువ కేవలం రూ.18,900 కోట్లు మాత్రమేనని, 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి ఇది రూ.4,22,000 కోట్లకు పెరిగిందని అశ్విని వైష్ణవ్ అన్నారు.అంతేకాకుండా, 2014లో మొబైల్ ఎగుమతులు దాదాపు సున్నాగా ఉండగా, ఇప్పుడు అది రూ.1,29,000 కోట్లు దాటిందన్నారు.ప్రభుత్వం చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాల కింద దేశంలో ఉత్పత్తి భారీగా పెరిగిందని.. భారతదేశం ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రధాన కేంద్రంగా మారిందని తెలిపారు.

'మేక్ ఇన్ ఇండియా' నుంచి ఆత్మనిర్భర్ వరకు..

భారతదేశం ఇప్పుడు మొబైల్ ఫోన్ల ఉత్పత్తిలోనే కాకుండా బొమ్మలు, రక్షణ పరికరాలు, ఎలక్ట్రిక్ వాహన మోటార్ల ఉత్పత్తిలో కూడా స్వావలంబన వైపు పయనిస్తోందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకారం.. 1950 %-% 1990 మధ్య అమలు చేయబడిన కఠినమైన విధానాల కారణంగా తయారీ రంగం దెబ్బతింది.. కానీ 'మేక్ ఇన్ ఇండియా' దానిని పూర్తిగా మారుస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ చొరవ భారతదేశంలో ఉత్పత్తిని పెంచడంలో, స్వావలంబనను ప్రోత్సహించడంలో, ఉపాధిని సృష్టించడంలో ముఖ్యమైన పాత్ర పోషి స్తోందని ఆయన అన్నారు.

దేశీయ ఉత్పత్తికి ప్రోత్సాహం..

గత దశాబ్దంలో మొబైల్ ఫోన్ తయారీ రంగం 12 లక్షలకు పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను సృష్టించిందని వైష్ణవ్ అన్నారు. ప్రభుత్వం ఇప్పుడు విలువను, వృద్ధిని మరింత లోతుగా తీసుకువెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందులో దేశీయంగా మరిన్ని భాగాలు, చిప్‌ల ఉత్పత్తి కూడా ఉందన్నారు. 'మేక్ ఇన్ ఇండి యా' కార్యక్రమం కింద, ఛార్జర్, బ్యాటరీ ప్యాక్, USB కేబుల్, కీప్యాడ్, డిస్ప్లే అసెంబ్లీ, కెమెరా మాడ్యూల్, లిథియం-అయాన్ సెల్, స్పీకర్, మైక్రోఫోన్ వంటి అనేక భాగాలు ఇప్పుడు భారతదేశంలో తయారు చేయబడుతున్నాయని మంత్రి వైష్ణవ్ అన్నారు. మేక్ ఇన్ ఇండియా భారతదేశ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని బాగా బలోపేతం చేసిందన్నారు.

# జంప్ జిలానీలకు కొత్త టెన్షన్..! కేటీఆర్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఏమన్నారంటే..

మొదటి పేజి తరువాయి

దీంతో వివరణ ఇచ్చేందుకు తమకు సమయం కావాలని కోరారు ఎమ్మెల్యేలు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా తెలంగాణ స్పీకర్ తాత్సారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై గత శుక్రవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు .. ఈనెల 10లోగా స్పీకర్ కార్యాలయం సమాధానం చెప్పాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు శాసనసభ కార్యదర్శి..సోమవారం ఏడుగురు ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టీ ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం సంజయ్‌కుమార్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపింది సుప్రీంకోర్టు. ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని గతంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను, కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈనెల 10న తదుపరి విచారణ జరగనుంది.

కేటీఆర్ ఏమన్నారంటే..

కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడే వరకు తమ పోరాటం ఆగదన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ ఏడాదిలోనే ఆ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయన్నారు. దీంతో ఫిరాయింపు ఎమ్మెల్యేలకు టెన్షన్ పట్టుకుంది. కొందరు ఎమ్మెల్యేలు తాము కాంగ్రెస్ కండువా కప్పుకోలేదంటున్నారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన క్యాంప్ ఆఫీస్‌లో ఇంకా కేసీఆర్ ఫొటోనే పెట్టుకున్నానని చెబుతున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా తన క్యాంప్ ఆఫీస్‌లో కేసీఆర్ ఫొటోనే ఉందంటున్నారు. అయితే అనర్హత వేటుకు భయపడి ఎమ్మెల్యేలు నెమ్మదిగా ప్లేట్ ఫిరాయిస్తున్నారని ఆరోపిస్తున్నారు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు. లేదంటే తమ క్యాంప్ ఆఫీస్‌లలో రేవంత్ రెడ్డి ఫొటో పెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి..

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులపై.. ఉప ఎన్నికలు వస్తాయంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఎమ్మెల్యేలకు నోటీసులు ప్రొసీజర్‌లో భాగమేనన్నారు రేవంత్ రెడ్డి. ఉప ఎన్నికల గురించి బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. సిరిసిల్లలోనూ ఉప ఎన్నిక రావొచ్చన్నారు సీఎం రేవంత్ రెడ్డి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సోమవారం సుప్రీంకోర్టు నోటీసులు ఇవ్వగా.. మంగళవారం అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు ఎమ్మెల్యేలు ఎలాంటి సమాధానం చెప్తారు. స్పీకర్ కార్యాలయం సంతృప్తి చెందుతుందా? సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుంది అన్న విషయం ఆసక్తికరంగా మారింది.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో మంత్రి నారా లోకేశ్ భేటీ

న్యూఢిల్లీ : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలోని ఆయన నివాసంలో ఈరోజు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించబోయే అఖిల భారత విద్యా మంత్రుల సమ్మేళనంను ఏపీలో ఏర్పాటు చేసే అవకాశం కల్పించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఏపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. విద్యారంగంలో కీలక సంస్కరణలపై చర్చించడానికి ఈ కాంక్లేవ్ ఒక వేదికగా ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక దుర్వినియోగం, కేటాయించిన వనరులను తక్కువగా ఉపయోగించడం వల్ల ఏపీలో విద్యావ్యవస్థ కుంటుపడిందన్నారు. దీనివల్ల మౌలిక సదుపాయాల అభివృద్ధితో సహా కీలక రంగాల్లో పెద్దఎత్తున బకాయిలు ఉన్నాయని తెలిపారు. కేజీబీవీలు, నైపుణ్య విద్య, ఐసీటీ ఆధారిత అభ్యాసం, నాణ్యత పెంపుదలకు కేంద్రం నుంచి ఏపీకి నిధుల కేటాయింపులు పెంచాలని కోరారు. ఏపీలో ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ప్రతి పంచాయతీలో మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేసి భరోసా కల్పించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇందుకు అధిక బడ్జెట్ కేటాయింపు అవసరం అవుతాయని, 2025-26 బడ్జెట్ లో ఏపీకి అత్యధికంగా నిధులు కేటాయించాలని కోరామన్నారు.రాష్ట్రంలో పీఎం శ్రీ పథకం కింద ఏర్పాటైన పాఠ శాలలు అద్భుతమైన పురోగతిని కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ కారణంగా తల్లిదండ్రులు, కమ్యూనిటీ సభ్యు లు, ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి డిమాండ్ పెరుగుతోందన్నారు. పీఎం శ్రీ ఫేజ్ -1, 2 లలో కలిపి ఏపీలో ప్రతిపాదించిన 2,369 పాఠశాలలకు గాను 855కు మాత్రమే మంజూరయ్యాయని తెలిపారు. గతంలో సిఫార్సు చేసిన మిగిలిన 1,514 పాఠశాలలను ఫేజ్ %-% 3 పీఎం శ్రీలో మంజూరు చేయండి. ఏపీలో ఉన్నత విద్య అభివృద్ధికి పూర్వోదయ పథకం కింద పెద్ద ఎత్తున సాయం అందించండి. యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.3,229 కోట్లు, రాష్ట్రంలో 37 ప్రభుత్వ కళాశాల భవనాల నిర్మాణానికి రూ. 555 కోట్లు, ఇప్పటికే పనిచేస్తున్న డిగ్రీ కళాశాలల్లో క్లాస్ రూమ్స్, ల్యాబరేటరీలు, లైబ్రరీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి రూ.330 కోట్లు మంజూరు చేయండి. కర్నూలు అబ్దుల్ కలాం ఉర్దూ యూని వర్సిటీ, ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీల్లో భవన నిర్మాణాలకు చెరో రూ.50 కోట్లు, రాష్ట్రంలో 10 మహిళా కళాశాలల ఏర్పాటుకు రూ.150 కోట్లు, రెండు మోడల్ డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు రూ.30 కోట్లు, రూ. 250 కోట్లతో ఏఐ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని మంత్రికి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. 4 మేజర్ యూనివర్సిటీల్లో ఇంక్యు బేషన్ హబ్ లను ఏర్పాటు చేసేందుకు రూ.20 కోట్ల చొప్పున రూ. 80 కోట్లు, హయ్యర్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ కు రూ. 50కోట్లు, ఎంపిక చేసిన యూనివర్సిటీల్లో ఇంటర్నేషనల్ స్టూడెంట్ హాస్టల్స్ నిర్మాణానికి రూ. 80కోట్లు, యూనివర్సిటీ హాస్టళ్లలో సౌకర్యాల మెరుగుదలకు రూ.180కోట్లు మంజూరు చేయాలని కోరారు. రీసెర్చి, ఇన్నొవేషన్, అకడమిక్ ఎక్సలెన్స్ హబ్ గా ఏపీని తీర్చిదిద్దేందుకు పూర్వోదయ పథకం కింద మొత్తంగా రూ.5,684 కోట్లు మంజూరు చేయాల్సిందిగా మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అందరి చూపూ ఆ ఐదు స్థానాలపైనే..!

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ రోజు జరుగుతోంది. మొత్తం 70 నియోజకవర్గాల్లో ఆప్, బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీలతో పాటు స్వతంత్రులు 699 మంది పోటీ చేస్తున్నారు. మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ, పోగొట్టుకున్న ప్రాభవాన్ని తిరిగి పొందాలని కాంగ్రెస్ పార్టీ, ఈసారి ఎలాగైనా ఢిల్లీలో పాగా వేయాలని బీజేపీ హోరాహోరీగా ప్రచారం చేశాయి. అన్ని పార్టీలు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. ఉచితాలకు దూరంగా ఉండే బీజేపీ ఈ ఎన్నికల సందర్భంగా పలు ఉచిత పథకాలు ప్రకటించడం గమనార్హం. ఇక ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పలు సంచలన ఆరోపణలు చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలోనే ఢిల్లీలోని ఐదు నియోజకవర్గాల్లో జరుగుతున్న పోలింగ్ పై అందరూ దృష్టి సారించారు.

అందరి చూపూ ఆ ఐదు స్థానాలపైనే..

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు నియోజకవర్గాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మాజీ సీఎం, ప్రస్తుత సీఎంలతో పాటు మాజీ డిప్యూటీ సీఎం పోటీ చేస్తున్న నియోజకవర్గాలు ఇందులో ఉన్నాయి.

న్యూఢిల్లీ

మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ పడుతున్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ నియోజకవర్గంలో పార్టీ జెండా పాతాలని బీజేపీ, కాంగ్రెస్ పట్టుదలగా ఉన్నాయి. ఇందుకోసం ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మను బీజేపీ బరిలోకి దించింది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేసిన దివంగత షీలా దీక్షిత్ ను గుర్తుచేసేలా కాంగ్రెస్ పార్టీ ఆమె కుమారుడు సందీప్ దీక్షిత్ ను నిలబెట్టింది. దీంతో మాజీ సీఎం వర్సెస్ మాజీ సీఎంల కుమారులుగా న్యూఢిల్లీ నియోజకవర్గం పోరు ఆసక్తికరంగా మారింది.

జంగ్ పుర

ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జంగ్ పుర నుంచి బరిలోకి దిగారు. లిక్కర్ స్కాంలో జైలుపాలైన సిసోడియా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనంతరం లిక్కర్ కేసులో బెయిల్ లభించడంతో సిసోడియా బయటకు వచ్చారు. సిసోడియాపై బీజేపీ తర్వీందర్ సింగ్ మార్వాను, కాంగ్రెస్ పార్టీ పర్హాద్ సూరిని నిలబెట్టాయి.

పర్పత్ గంజ్

2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పర్పత్ గంజ్ నుంచి మనీశ్ సిసోడియా పోటీచేసి గెలుపొందారు. అయితే, ఈసారి ఈ స్థానంలో ఆప్ అభ్యర్థిని మార్చింది. యూపీఎస్సీ ట్యూటర్ గా పేరొందిన అవధ్ ఓజాను ఇక్కడ నిలబెట్టింది. బీజేపీ నుంచి రవీందర్ సింగ్ నేగి ఇక్కడ పోటీపడుతుండగా, కాంగ్రెస్ పార్టీ తరఫున చౌదరి అనిల్ కుమార్ బరిలోకి దిగారు.

కల్కాజీ

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ సీనియర్ నేత అతిశీ కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీపడుతున్నారు. బీజేపీ తరఫున రమేశ్ బిధూరి బరిలోకి దిగారు. ఈ నియోజకవర్గంలో ప్రధాన పోటీ వీరిద్దరి మధ్యే ఉండనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బిజ్వాసన్

గతేడాది ఆమ్ ఆద్మీ పార్టీకి గుడ్ బై చెప్పి బీజేపీలో చేరిన ఢిల్లీ మాజీ మంత్రి కైలాశ్ గెహ్లోట్ బిజ్వాసన్ నియోజకవర్గ బరిలో నిలిచారు. ఇక్కడ ఆప్ నుంచి సురేంద్ర భరద్వాజ్ పోటీ పడుతుండగా, కాంగ్రెస్ పార్టీ దేవేంద్ర సెహ్రావత్ ను నిలబెట్టింది.

## తీన్మార్ మల్లన్న మా పార్టీనా, కాదా నిర్ణయించుకోవాలి: సీతక్క ఆగ్రహం


ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం తాము ఎంతో కష్టపడ్డామని ఆమె పేర్కొన్నారు. పార్టీలో ఉన్నప్పుడు పార్టీ లైన్‌లోనే మాట్లాడాలని సూచించారు. ఆయన ఏదైనా అంశాన్ని లేవనెత్తాలనుకుంటే పార్టీ నిర్వహించే సమావేశాలకు వచ్చి ప్రశ్నించవచ్చునని ఆమె అన్నారు. ఆయనకు ఎలాంటి అనుమానం ఉన్నా వచ్చి నిలదీయ వచ్చునన్నారు. కుల గణన నివేదికకు నిప్పు పెట్టడం దారుణమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన నివేదిక తప్పుల తడక అని, దానిని తీన్మార్ మల్లన్న కాల్చివేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. బీసీలకు న్యాయం చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క స్పందించారు. కుల గణనలో తప్పులు జరిగాయని విమర్శలు చేసిన బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై కూడా మంత్రి స్పందించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు కుల గణనలో పాల్గొనలేదన్నారు. సర్వేలో భాగస్వాములు కాని వారికి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. దేశంలోనే తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో కుల గణన చేసిందని, ఇది దేశానికి దిక్సూచి అని ఆమె అన్నారు.

## తనకు కేసీఆర్ ఫోన్ చేశారనే వార్తలపై ఈటల రాజేందర్ స్పందన

హైదరాబాద్ : బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నుంచి ఫోన్ కాల్ వెళ్లిందని... మళ్లీ కలిసి పని చేద్దామని కేసీఆర్ పిలిచారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగు తోంది. ఈ ప్రచారంపై ఈటల స్పందించారు. ఇదంతా తప్పుడు ప్రచారమేనని ఈటల కొట్టిపడేశారు. తానంటే గిట్టని వాళ్లు, సోషల్ మీడియాలో ఉండే సైకోలు, శాడిస్టులు మాత్రమే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తారని ఆయన మండిపడ్డారు. ఈ ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కేసీఆర్ గురించి తాను స్పష్టంగా తన అభిప్రాయాలను చెపుతున్నప్పటికీ... కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చ రించారు. పార్టీలు మారడం అనేది పిల్లల ఆటకాదని ఈటల వ్యాఖ్యానించారు. తామంతా బాధ్యత గల పొలిటీషియన్లు అని చెప్పారు. వాళ్లది వాళ్ల పార్టీ, తమది తమ పార్టీ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించి, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తన లక్ష్యమని చెప్పారు. గతం లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో సరైన సమాచారం లేదని... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో కూడా శాస్త్రీయత లోపించిందని విమర్శించారు. వైఎస్ రాజ శేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే బీసీ-ఈ గ్రూపు తీసుకొచ్చారనేది తప్పుడు వాదన అని ఈటల అన్నారు. అంతకు ముందే కొన్ని ముస్లిం కులాలు బీసీ-బీ గ్రూపులో ఉన్నాయని చెప్పారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న కులా లను గుర్తించిన తర్వాతే కులగణన చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి చేయకుండా కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. ఇదంతా డైవర్షన్ పాలిటిక్స్ లో భాగమేనని... దీనివల్ల ప్రజలకు ఉపయోగం లేదని చెప్పారు. విద్యార్థిగా ఉన్నప్పుడు తాను విద్యార్థి సంఘాలలో చురుకుగా ఉండేవాడినని ఈటల తెలిపారు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లో తాను చదువుకున్నానని... విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నానని చెప్పారు. విద్యార్థుల హక్కుల కోసం ఎప్పుడూ నిలబడతానని అన్నారు. ఎంతో నిబద్ధతతో రాజకీయాలు చేస్తున్న వ్యక్తిని తానని చెప్పారు.

# ఇకపై తెలుగులోనే జీవోలు.. చంద్రబాబు ప్రభుత్వ కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి



ఏకంగా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిగా ఇంగ్లీషు మాధ్యమంలోనే బోధన జరిగేలా వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. ఆ సమయంలో తన ఆందోళనలను, అభ్యంతరాలను వ్యక్తం చేసిన అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్య మంత్రి తెలుగు భాషను కాపాడు కోవాలని పిలుపునిచ్చారు. తాను అధికారం లోకి వస్తే తెలుగు మాధ్యమానికి ప్రాధాన్య మిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వ జీవోలు కూడా తెలుగులో ఉండేలా చేస్తానన్నారు. అప్పటి హామీని సీఎం హోదాలో చంద్రబాబు నెరవేర్చారు. తెలుగు భాష వెలుగులు పంచేలా ఇకపై రాష్ట్రంలో జారీ అయ్యే ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) తెలుగులో కూడా వెలువరించాలని తాజాగా నిర్ణయం తీసుకున్నరు. బుధవారం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా మొట్టమొదటి తెలుగు జీవో విడుదల చేశారు. హోంశాఖ జారీ చేసిన ఈ జీవో ద్వారా ఓ ఖైదీ పెరోల్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక నుంచి ఏపీ ప్రభుత్వ ఉత్తర్వులు అన్నీ తెలుగులో కూడా ఉండాలని ప్రభుత్వం ఆయా శాఖలకు సూచించింది. ముందుగా ఇంగ్లీషులో జీవో విడుదల చేస్తామని, తర్వాత రెండు రోజులకు తెలుగులో జీవో వెలువరిస్తామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా ప్రతి జీవో ప్రజలు తెలుసుకునేలా పబ్లిక్ డొమైన్ లో అందుబాటులో ఉంచాలని సూచించింది. ఫలించిన బాబు కృషి గత ప్రభుత్వంలో ఎక్కువగా జీవోలను రహస్యంగా జారీ చేసేవారని ఆరోపణలు ఉన్నాయి. ఇంటర్నెట్ లో కూడా జీవోలు అందుబాటులో ఉండటం లేదని అప్పట్లో టీడీపీ విమర్శలు చేసింది. ఇప్పుడు ఆ పద్ధతికి పూర్తిగా చరమగీతం పాడింది. ఇక తెలుగులో కూడా జీవోలు విడుదల కానుండటంతో ప్రభుత్వ పాలన వ్యవహారాలు, ఉత్తర్వులపై ప్రజలు సంపూర్ణంగా అవగాహన పెంచుకోవచ్చననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఇంగ్లీషులో జీవోలు వస్తుండటం వల్ల 90 శాతం మంది అర్థం చేసుకోలేకపోతున్నారని అంటున్నారు. భవిష్యత్ లో తెలుగులో కూడా జీవోలు అందుబాటులో ఉండటంతో ఎవరూ తప్పుగా పొరబడాల్సిన ఇబ్బంది కూడా ఉండదని అంటున్నారు.

## పహాడీ హనుమాన్ దేవాలయం నూతన కమిటీ సభ్యులను సన్మానించిన..

### సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్): సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్ పహడి హనుమాన్ దేవాలయం నూతన కమిటీని సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయంలో ఎటువంటి అవకతవకలు జరగకుండా, గత ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు కాబట్టి నూతన కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధి కోసం కృషి చేయాలని కమిటీ వారికి తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు గణేష్ యాదవ్, పహాడీ హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ మేకల లక్ష్మణ్ ప్రసాద్, మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పడకేసిన నిఘా కన్ను

### పోలీసుల అమ్ములపొదిలో ప్రధానమైన అస్త్రం నిఘా నేత్రం

### దిష్టిబొమ్మల్లా సీసీకెమెరాలుప్రజాధనం వృథా



సంగెం (శుభోదయం న్యూస్) : మండలంలోని వివిధ గ్రామాలలో నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి.గతంలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా,చైన్ స్నాచింగ్,హత్యలు,హత్యాయత్నాలు జరిగినా తీగారాజుపల్లి సెంటర్లో ఉన్న సీసీ కెమెరాలు ఆ దృశ్యాలను నిక్షిప్తం చేసేవి.అయితే గత కొద్ది నెలలుగా మండలంలోని తీగరాజుపల్లి సెంటర్లో సీసీ కెమెరాల విభాగం పనిచేయడం లేదు.దీంతో లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నేడు అలంకార ప్రాయంగా మారాయి.జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న తీగరాజుపల్లి సెంటర్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు సైతం మూలనపడ్డాయి.పట్టించుకోవాల్సిన అధికారులు వాటి పై దృష్టిసారించడం లేదు.ప్రజల సహకారంతో అప్పుడు ఉన్న అధికారి దాదాపు రూ.లక్షల వ్యయంతో మండల కేంద్రంలోని ప్రధాన కూడలి లలో తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కొంతకాలం వరుకు పనిచేశాయి.ఆ తరువాత పనిచేయడంలేదు.సీసీ కెమెరాలు పనిచేస్తున్న సమయంలో... అప్పట్లో జరిగిన పలు హత్యలు,చోరీ కేసుల్లో నిందితులను,రోడ్డు ప్రమాదాలకు కారణమైన వాహనాలను గుర్తించేందుకు ఎంతో ఉపయోగ పడ్డాయి.ప్రస్తుతం సీసీ కెమెరాలు పనిచేయక దాదాపు నాలుగేళ్లు అయినా మరమ్మతులు చేయించలేదు.అప్పట్లో గ్రామ ప్రజలు నేరాల నియంత్రణ కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు దాదాపు లక్షల విరాళం ఇచ్చారు.అయితే తిరిగి వాటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజా ధనం వృథాగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిఘా నేత్రాలను ఉపయోగంలోకి తేవాలని మండలంలోని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పుల్లూరి దిలీప్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



పరకాల నియోజకవర్గం, శుభోదయం న్యూస్ : పర్వతగిరి మండల కేంద్రంలో పుల్లూరి దిలీప్ నానమ్మ గారైన పుల్లూరి ఎల్లమ్మ నిన్నటి రోజున మరణించగా వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు వీరితో పాటు మండల కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్, మాజీ డైరెక్టర్ పిన్నింటి సునీల్, ఐనవోలు దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు బందెల వెంకన్న, దారం పూర్ణ చందర్, మండలం మాజీ అధ్యక్షులు అబ్రపురి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు కుసం రామ్ చందర్, పర్వతగిరి మాజీ ఉప సర్పంచ్ రంగు జనార్దన్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కందికట్ల అనిల్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎర్రభోయిన సాంబరాజు యాదవ్,యువజన కాంగ్రెస్ మాజీ నియోజకవర్గం అధ్యక్షులు కొమ్ము రమేష్, దౌలత్ నగర్ గ్రామ పార్టీ అధ్యక్షులు కత్తుల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్కండేయ, మెషినేని మాధవ రావు,కత్తుల ఐలయ్య, రంగు వెంకన్న, కత్తుల వెంకన్న (చిన్న)యూత్ నాయకులు అజయ్ రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్: చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం




శుభోదయం ప్రతినిధి శంకర్‌పల్లి: ఫిబ్రవరి 05: దేశంలోని పేదరిక నిర్ములన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రత్నం మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరికీ ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్ ను ప్రవేశపెట్టిందన్నారు. ఉద్యోగులకు రూ.12లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు గొప్ప విషయమన్నారు. వచ్చే ఐదేళ్లలో ప్రపంచ ఆర్థికరంగంలో మనదేశం మూడో స్థానంలో నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన శ్రీకాంత్ చారి వారి అనుచరులు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బిజెపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, రాములు గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు లీలావతి బయానంద్, మున్సిపల్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వాసుదేవ్ కన్నా, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహ, కృష్ణారెడ్డి, బీర్ల సురేష్, నరసింహారెడ్డి, పండిత్ రావు గౌడ్, వీరేందర్, ప్రవీణ్ కుమార్, మధుమోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమోదించిన......

### కాంగ్రెస్ ప్రభుత్వానికి - ముఖ్యమంత్రికి సహకరించిన ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు



పరకాల నియోజకవర్గం, శుభోదయం న్యూస్ : "తెలంగాణలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) దేశంలోనే ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం. సమాజ అభివృద్ధికి ఈ నివేదిక ఒక దిక్సూచిలా, ఒక మాడల్ డాక్యుమెంట్‌లా మారుతుంది. సమాజంలో మా లెక్కలు తేల్చాలని ఏడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బలహీన వర్గాలు, మైనారిటీల ఆకాంక్షలకు అనుగుణంగా పకడ్బందీ ప్రణాళికతో ఏడాది కాలంలో సర్వేను విజయవంతంగా పూర్తి చేశాం. రాష్ట్రంలో అమలు చేయబోయే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలకు ఈ నివేదిక ప్రాతిపదికగా పనిచేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. శాసనసభ వేదికగా సభ్యుల హర్షధ్వానాల మధ్య ప్రకటన చేశారు.తెలంగాణలో విజయవంతంగా పూర్తి చేసిన 'సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన' (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) ను ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. అనంతరం ముఖ్యమంత్రి గారు సర్వేపై సమగ్రంగా వివరిస్తూ ప్రత్యేకంగా సమావేశమైన శాసనసభ వేదికగా ప్రకటన చేశారు.రాష్ట్రంలో 46.25 శాతం ఉన్న బీసీలు, మైనారిటీల్లోని బీసీలు కలుపుకుని 56.33 శాతం ఉన్న బీసీలందరికీ సమాజంలో సముచితమైన గౌరవం, స్థానం కల్పించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే బలహీన వర్గాల జనాభా గణాంకాలపై చర్యలు చేపట్టాం. ఈ సర్వే నివేదికకు పూర్తి స్థాయి చట్టబద్ధత కల్పించాలన్న ఉద్దేశంతో కమిషన్ ఇచ్చిన నివేదికను మంత్రిమండలి ఉపసంఘం ద్వారా మంత్రిమండలి ఆమోదించింది.సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వే 2024 నివేదికను ఈ శాసనసభలో ప్రవేశపెట్టడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఇది నాకు జీవిత కాలం గుర్తిండిపోయే సందర్భం.అన్ని విషయాలను పరిగణలోకి తీసుకున్న తర్వాత రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్డ్ తరగతి ప్రజలు, రాష్ట్రంలోని ఇతర బలహీన వర్గాల స్థితిగతులను మెరుగుపరచడానికి వివిధ సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన ఉపాధి రాజకీయ అవకాశాల కోసం ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్న లక్ష్యంతో ఈ సర్వే చేపట్టడం జరిగింది.తెలంగాణ గౌరవ గవర్నర్ గారితో మొదలుపెట్టి, రాష్ట్రంలో 6 నవంబర్ 2024 న సర్వే ప్రారంభించగా 25 డిసెంబర్ 2024 నాటికి పూర్తయింది. 50 రోజులు సర్వే ముగిసే సమయానికి మొత్తం కుటుంబాల సంఖ్య గ్రామీణ ప్రాంతాలలో 66,99,602 నగర ప్రాంతాల్లో 45,15,532 కాగా మొత్తం 1,12,15,137 కుటుంబాలు (96.09 శాతం) ఉంది. సరిగ్గా ఏడాది కాలంలో పూర్తి చేసి నివేదికను శాసనసభ ముందుకు తెచ్చాం.సర్వే ఫలితాల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీలు 61,84,319 (17.43 శాతం), ఎస్టీల్లో 37,05,929 (10.45 శాతం), బీసీలు 1,64,09,179 (46.25 శాతం) ముస్లిం మైనారిటీల్లో బీసీలు 35,76,588 (10.08 శాతం) ఉంది. ముస్లిం మైనారిటీ బీసీలను కలుపుకుంటే తెలంగాణలో మొత్తం బీసీల సంఖ్య 56.33 శాతంగా ఉంది.రాష్ట్రంలో మైనారిటీ జనాభా 44,57,012 (12.56 శాతం) ఉండగా, ముస్లిం మైనారిటీల్లో ఓసీలో 80,424 (2.4 శాతం) ఉంది. హిందూ ఓసీలు 13.31 శాతం ఉంది. ముస్లిం మైనారిటీల్లోని ఓసీలను కలుపుకుంటే మొత్తం ఓసీల జనాభా 15.79 శాతం ఉంది.ఈ సర్వే ద్వారా సేకరించిన డేటాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర బలహీన వర్గాల సంక్షేమానికి అవసరమైన విధానాల రూపకల్పనలో ప్రభుత్వం ఉపయోగిస్తుంది. ఈ సమగ్ర సర్వే తెలంగాణ నూతన దశ ప్రారంభాన్ని సూచిస్తుంది. ఈ సర్వే సమానాభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతను, తెలంగాణ ప్రజల భిన్న అవసరాలను తీర్చే పద్ధతిని ప్రతిబింబిస్తుంది.దేశంలో గత 75 ఏళ్లుగా ఎన్నో విజ్ఞప్తులు వచ్చినప్పటికీ బలహీన వర్గాలు, ఇతర కులాలు, ఉప కులాలకు సంబంధించిన వివరాలను సేకరించలేదు. అందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రాలేదు.మా ప్రభుత్వం 7 డిసెంబర్ 2023 అధికారం చేపట్టిన వెంటనే బీసీ వర్గాల జనాభా లెక్కలు తేల్చాలన్న చిత్తశుద్ధితో 4 ఫిబ్రవరి 2024 నాడు మంత్రివర్గంలో ఆమోదం పొంది సమగ్ర సర్వేపై 6 ఫిబ్రవరి 2024 శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టాం.ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి ప్రక్రియ న్యాయస్థానాల ముందు నిలవకపోవడంతో, అలాంటి తప్పిదం జరగరాదని, సర్వే పకడ్బంధీగా ఉండేలా చర్యలు తీసుకున్నాం.

## బీసీ కుల గణన, ఎస్సీల వర్గీకరణ నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయి: రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీంభరత్



శుభోదయం ప్రతినిధి శంకర్‌పల్లి: ఫిబ్రవరి 05: నిన్న శాసనసభలో రెండు చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న విషయం మనకు తెలిసిందే. ఎన్నో ఏళ్ళుగా పెండింగ్ లో ఉన్న బిసి కులఘననను, ఎస్సీల వర్గీకరణ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి బీమ్ భరత్ అన్నారు. బుధవారం ఆమె పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూసమాజంలో రెండు ప్రధాన వర్గాలు బిసిలు, ఎస్సీలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కులఘనన, వర్గీకరణ కార్యక్రమాలు కార్యాచరణకు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు అన్ని గ్రామాలలో, మండలాలలో, నియోజకవర్గాలలో పెద్ద ఎత్తున సంబరాలు చేయాలని పిలుపునిచ్చారు. సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉప సంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, కో చైర్మన్ దామోదర్ రాజా నర్సింహ, సభ్యులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవిలకు ధన్యవాదాలు తెలిపారు.కార్యకర్తలు, నాయకులు, బిసి, ఎస్సీ వర్గాలు కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని శ్రీజ్యోతి బీమ్ భరత్ కోరారు.

## సేవా దృక్పథం ఉన్న ప్రతి ఒక్కరికి ఆదర్శం జ్వాలా చారిటబుల్ ట్రస్ట్

### బి శ్రీ లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ చైర్మన్ ఈశ్వర్ చంద్ శర్మ



మంగపేట మండల (శుభోదయం న్యూస్) : కేంద్రంలో గత 12 సంవత్సరాలుగా ఎంతో మంది పేదలకు పేద విద్యార్థులకు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేక ఆర్థిక ఇబ్బంది పడుతున్న వందల మంది నిర్భాగ్యులకు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచి ఎంతోమంది ప్రాణాలను కాపాడిన గొప్పతనాన్ని కీర్తిని తమ సొంతం చేసుకున్నారు వారు చేస్తున్న సేవను ప్రముఖ యూనివర్సిటీ గుర్తించి వారి సేవా దృక్పథానికి డాక్టరేట్ ఇవ్వడం ఎంతో గర్వకారణంగా మేము భావిస్తున్నాం..ఇప్పటికి ఎప్పటికీ జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, మునిగాల రాకేష్ సేవలు మా హృదయంలో ఎప్పుడూ నిలిచి ఉంటాయని వారు మానవత్వాన్ని ప్రతిబింబంగా ఈరోజు ఈ సమాజానికి కనిపిస్తున్నారు యువతరానికి వారు ఒక ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు .. జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ కు కొండంత అండగా వెనకుంటూ జ్వాల చారిటబుల్ ట్రస్ట్ సేవలను సమాజంలోకి ఇంకా ప్రభావవంతంగా తీసుకు వెళ్లేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న గౌరవ సలహాదారులు కోళగట్ల.నరేష్ రెడ్డి హనుమంతుడిల్లా జ్వాలా ట్రస్ట్ కు ఎప్పుడు బలాన్ని చేకూరుస్తున్న గొప్ప వ్యక్తి వారు అని శ్రీ లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ చైర్మన్ ఏడు నూతల ఈశ్వర్ చంద్ శర్మ అన్నారు..ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు శ్రీ లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ మండల అధ్యక్షులు నూతల కంతి ఈశ్వర్ చంద్, ట్రస్ట్ గైడెన్సీ జై భీమ్ రామ్మోహన్, ట్రస్ట్ సభ్యులు మురళి, జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, చాదా మల్లయ్య,బొప్పరాపు రాజు,బండిపల్లి.రవి, రోహిత్

## కులగణన సర్వే తప్పుడు తడకలు కాకి లెక్కలు..

### బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా కాకులమర్రి లక్ష్మణ్ బాబు



రాష్ట్ర ప్రభుత్వం (శుభోదయం న్యూస్) : జరిపించిన కులగణన సర్వే తప్పులతడకగా,కాకి లెక్కలతో అశాస్త్రీయంగా ఉందని బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అన్నారు.... కులగణన సర్వే పై బుధవారం వారు విడుదల చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదేళ్లలో తెలంగాణ జనాభా కేవలం రెండు లక్షలు మాత్రమే పెరిగిందని ఈ ద్వారా పేర్కొనడం విడ్డూరంగా ఉందని బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు వ్యాఖ్యానించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 2014లో జరిపించిన ఎస్ కె ఎస్ ప్రకారం బీసీలు (ముస్లింలలోని బీసీలు కాకుండా) 52% అని నిర్ధారణ కాగా,అదిప్పుడు 46%శాతమేనని ప్రభుత్వం వెల్లడించడం,6% తగ్గించి చూపడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.బీసీల జనాభాను తగ్గించి చూపడమే కాక,ఈ తప్పులతడక సర్వే నివేదికను మంత్రిమండలి ఆమోదించడం,చట్టసభల్లో ప్రవేశపెట్టి ప్రజలకు తప్పుడు సమాచారమిచ్చి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం తీవ్ర అభ్యంతరకరమన్నారు.రాజ్యాధికారంలో బీసీలను భాగస్వాములను చేయాలన్న చిత్తశుద్ధి అధికార పార్టీలో పూర్తిగా లోపించిందని కాకులమర్రి లక్ష్మణ్ బాబు మండిపడ్డారు.కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేసే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఏ కోశానా కూడా లేదనేది ఈ అశాస్త్రీయ కులగణన సర్వేతో తేటతెల్లమయ్యిందన్నారు.బీసీల పట్ల కాంగ్రెస్ పాలకులకు చాలా చులకన భావం నెలకొందని చెప్పడానికి మంత్రిమండలి కూర్పే ఒక ప్రబల నిదర్శనమని అన్నారు.బీసీలలో అత్యధిక సంఖ్యలో ఉన్న మున్నూరుకాపు,యాదవ్, ముదిరాజ్,కుర్మలకు మంత్రివర్గంలో చోటివ్వకపోవడం,రాజ్యాధికారంలో న్యాయమైన వాటా దక్కకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తంచేశారు.కులగణన సర్వేలో చోటుచేసుకున్న తప్పులను వెంటనే సరిదిద్దాలని,ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్స్ కల్పించాలని,కేబినెట్ విస్తరణలో నలుగురు బీసీలకు స్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు.అన్ని రంగాలలో తీవ్ర అన్యాయానికి గురవుతున్న బీసీలను బీఆర్ఎస్ మరింత సంఘటితపరుస్తూ న్యాయమైన హక్కులు,వాటా కోసం నిరంతరం పోరాడుతుందని కాకులమర్రి లక్ష్మణ్ బాబు స్పష్టం చేశారు.

## హామీల అమలు విషయంలో కాంగ్రెస్ పార్టీ విధానం సరికాదు

### బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కుడికాల భాస్కర్



ములుగు జిల్లా, (శుభోదయం న్యూస్) : మంగపేట మండలంలో జిల్లా అధ్యక్షులు ఉరగొండ మురళీ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు అడుగడుగున మోసాలు జరుగుతున్నాయని, 18 హామీలు ఇచ్చి నేటికీ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్ కేటాయింపులు చేయక కేవలం 9000 కోట్లు మాత్రమే చేసి మోసం చేశారని, కుల గణన విషయంలో కూడా మోసపూరిత వైఖరితో ఉన్న పరిస్థితుల్లో బీసీ ఆజాది ఫెడరేషన్ తరపున 12 రోజులు ఆమరణ దీక్ష చేయడం వల్లనే ఈరోజు కులగణన జరిగిందని, అసెంబ్లీ తీర్మానం చేసి చేతులు దులుపుకుంటే సరికాదని, 42 శాతం రిజర్వేషన్ తాము అధికారంలోకి వస్తే కేటాయిస్తామన్నారు కానీ కేంద్రంపై నెట్టివేస్తే ఇది ముమ్మాటికి బీసీలను మోసం చేసినట్లు అని, మరి ఆనాడు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చేటువంటి సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఈ విధానం గుర్తుకు రాలేదా, ఎందుకు బీసీలను మోసం చేసే హామీలు ఇచ్చారని అన్నారు. బీసీలకు జరుగుతున్న మోసాలను తిప్పి కొట్టడానికి, కాంగ్రెస్ పార్టీ 42% రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలకు పోతే మాత్రం తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు, కాంగ్రెస్ మోసాలపై త్వరలో " పల్లె బాట" కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.రెడ్ల సామ్రాజ్యాన్ని నడిపిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో తప్పకుండా నెరవేర్చాలని, మోసం చేసే ప్రక్రియలు కొనసాగిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు, ఎట్టి పరిస్థితుల్లో స్థానిక సంస్థల్లో 42 శాతానికి రిజర్వేషన్లు పెంచాల్సిందేనని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుడికాల భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వ్యాసభట్టు మధుసూదన్ రాజు, ఉమ్మడి జిల్లా ఇంచార్జీ జినుకల్ లక్ష్మణరావు, వరంగల్ జిల్లా ఇన్చార్జి గజవెల్లి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నాం తెలంగాణ మాల మహా నాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు చిట్టిమల్ల సమ్మయ్య




(శుభోదయం న్యూస్) : ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభ శాసనమండలి ఉభయసాభలలో ఆమోదిం చిన దానికి వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసే కార్య క్రమంకు మాల మహా నాడు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయకుండ మంగపేట మండలం తెలంగాణ మాల మహా నాడు నాయకులను పోలీసులు ముందస్తు అరె స్టులు చేశారు.తెలంగాణ మాల మహా నాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు చిటిమల్ల సమ్మయ్య మాట్లా డుతూ దళితుల ఐక్యతకోసం 20% రిజర్వే షన్లను పెంచాలని డిమాండ్ చేస్తు రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేయకుండా ముందస్తు అరెస్టు చేయడం అప్రజా స్వామికం అని అన్నారు.ముందస్తు అరెస్టు అయిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కర్రీ శ్యాంబాబు, నాయకులు జానపట్ల జయరాజు,కర్రీ శ్రీను,బియ్యం శ్రీను,కూకట్ల శ్రీను,ఉన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ చైర్మన్ ఏడు నూతల ఈశ్వర్ చంద్ సాంగ్ ఆడియో లాంచ్ ..




(శుభోదయం న్యూస్ )మంగపేట మండల కేంద్రంలో జ్వాలా యూత్ గౌరవ సలహాదారులు కోలగట్ల. నరేష్ రెడ్డి చేతుల మీదుగా శ్రీ లక్ష్మీనరసింహ దత్తసేనా సేవా ట్రస్ట్ చైర్మన్ ఏడు నూతల ఈశ్వర్ చంద్ శర్మ సాంగ్ ఆడియో లాంచ్ చేయడం జరిగింది..నరేష్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ చైర్మన్ ఏడు నూతల ఈశ్వర్ చంద్ శర్మ ఎంతోమంది పేదలకు పేద విద్యార్థులకు అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారికి తన వంతు ఆర్థిక సాయం అందిస్తూ మానవత్వమే తన తత్వం అని ఈ సమాజానికి చాటుతున్న గొప్ప వ్యక్తి ఏడు నూతన శర్మ వారి సహాయ సహకారాలు ఈ సమాజానికి అక్షర రూపంలో తెలియజేయాలని జై భీమ్ రామ్మోహన్ ఆధ్వర్యంలో మద్దెల సమ్మక్క రచన గానంతో అద్భుతమైన పాట వారి గురించి రావడం చాలా సంతోషంగా ఉంది .. ఈ పాటలో ప్రతి అక్షరం వారి గొప్పతనాన్ని వారిలోని మానవత్వాన్ని తెలియజేసేలా ఉంది ఈశ్వర్ చంద్ శర్మ లాంటి గొప్ప వ్యక్తి పాటను నేను ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉంది , ఈ పాటను రచించిన రచయిత గాయని మద్దెల సమ్మక్క ఇంకా భవిష్యత్తులో గొప్ప గొప్ప పాటలు రాసి గొప్ప స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాను,ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనరసింహ దత్తసేన సేవా ట్రస్ట్ సభ్యులు, మరియు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు..

## ఘనంగా 10వ సారి బాసర మహాపాదయాత్ర



బీర్కూర్ మండల రిపోర్టర్ ( శుభోదయం న్యూస్) :- బీర్కూరు మండల కేంద్రం నుండి 2016 లో సుధాకర్ యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో అమ్మవారి జన్మదినం(వసంత పంచమి ) ని పురస్కరించుకొని కేవలం తొమ్మిది మంది తో ప్రారంభం అయినా పాదయాత్ర దిన దిన ప్రచుర్యం పొంది ఇ సంవత్సరం వసంత పంచమికి 90 మందికి చేరింది. పదో వార్షికోత్సవం సందర్భంగా మహా పాదయాత్ర బృందం ఆధ్వర్యంలో సుధాకర్ యాదవ్ గురు స్వామికి మరియు డాక్టర్ బాలకృష్ణ లకు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాదయాత్ర బృందం కమిటీ సభ్యులు సాయి కృష్ణ పటేల్ మాట్లాడుతూ సుధాకర్ యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో గత పది సంవత్సరాల క్రితం తాము కేవలం 9 మంది సభ్యులతో ప్రారంభమైన పాదయాత్రను యువతను చైతన్య పరచడం, భక్తి సేవా భావంతో యువత మరియు పెద్దలను కులాలకు అతీతంగా ప్రోత్సహిస్తూ ఇంతింతై వతుడింతై అన్నట్లుగా దిన దిన ప్రాచుర్యం పొంది పాదయాత్రను మహా పాదయాత్రగా తీర్చిదిద్దడానికి సుధాకర్ యాదవ్ గురుస్వామి చేస్తున్న కృషి ఎనలేనిది అని కొనియాడారు. మహా పాదయాత్ర కమిటీ సభ్యులు గుడికొండ బాలకృష్ణ మాట్లాడుతూ సుధాకర్ యాదవ్ గురుస్వామి చేస్తున్న సేవలను గుర్తుచేసుకుంటూ ఎన్నో ఆటంకాలను అందరిని ఒక తాటిపైకి తీసుకొచ్చి ఇంతటి మహా పాదయాత్ర నిర్వహిస్తున్న సుధాకర్ యాదవ్ గురుస్వామి మరియు సహకారం అందిస్తున్న బృందానికి సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది.సుధాకర్ యాదవ్ గురుస్వామి మాట్లాడుతూ ఇంతటి మహా పాదయాత్రను నిర్వహించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న దాతలు మరియు మహా పాదయాత్ర బృంద సభ్యులకు ఆ అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని పేరుపేరునా పాదయాత్రకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

శంకర్పల్లి, శుభోదయం న్యూస్ : విద్యుత్ వినియోగదారులకు తెలియజేయునది ఏమనగా 33కేవీ లైన్ కింద చెట్టు కొమ్మలు నరికివేత కారణంగా బయోసీడ్ ఫిడర్ మరియు మీర్జాగూడ ఫీడర్ మరియు ఖానాపూర్ ఫీడర్లకు సంబంధించి మేకంగడ్డ, మీర్జాగూడ విలేజ్,జనవాడ విలేజ్, కొల్లూరు గేట్,ఇంద్రారెడ్డి నగర్ ఫేస్ 1, మరియు ఫేస్ 2 లకు తేది 06/02/2025 ఉదయం 10:00 నుండి 4:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ మోకిలా సెక్షన్ తెలిపారు. కావున ప్రజలు గమనించి సహకరించగలరని కోరారు.

## మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

## మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్





వలిగొండ, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి, మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కూచిమల్ల నాగేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయడం అనేది రాజ్యాంగానికి విరుద్ధమనని, మాలల ఓట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విషయం మర్చిపోవద్దని గుర్తు చేశారు. మాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని ఈ వర్గీకరణను ఉపసంహరించుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల్లో వర్గీకరణ చేయకముందే తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి అత్యుత్సాహం ఎందుకు చూపిస్తున్నారో మాలలకు జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని గమనిస్తున్న మాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు నిమ్మకు నీరెత్తినట్టుగా ఉంటూ వర్గీకరణ విషయంలో మాలలకు జరుగుతున్న అన్యాయంపై ఎలాంటి స్పష్టమైన వైఖరి తెలియజేయకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఇకనైనా మాలలను దృష్టిలో ఉంచుకొని వర్గీకరణను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు నీలం నరేందర్, ఉపాధ్యక్షులు బుంగ శేఖర్, పుర్మ అంజయ్య, ప్రధాన కార్యదర్శి కాశమల్ల శేఖర్, కోశాధికారి చలిచీమల కృష్ణ, సహాయ కార్యదర్శులు కట్ట సురేష్, వలమల బిక్షపతి, జై భీమ్ సేన అధ్యక్షులు వలమల రత్నయ్య, చిత్తాపురం గ్రామ అధ్యక్షులు వలమల కృష్ణ, కట్ట దానయ్య, మద్దెల వెంకటేశం, పట్టేటి వీరయ్య, పెరుమాండ్ల ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్మ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షునిగా వెంకటేష్ గౌడ్




వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్ ): ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల యాజమాన్యాల సంఘం ట్రస్మా యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ ఎన్నికలు మంగళవారం సాయంత్రం స్థానిక దివ్యభాల విద్యాలయంలో జరిగాయి. జిల్లా అధ్యక్షునిగా మండల పరిధిలోని గోకారం గ్రామానికి చెందిన పాలకూర వెంకటేశం గౌడ్ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కందాల పాపిరెడ్డి , రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సారథ్యంలో ఎన్నికలు నిర్వహించారు.జిల్లా గౌరవ అధ్యక్షులు గా గాదె సోమిరెడ్డి, జిల్లా గౌరవ సలహాదారుగా మెరుగు మధు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాసరి శ్రీరాములు, మహిళా కార్యదర్శిగా వెల్దుర్తి భాగ్యలక్ష్మి, కోశాధికారిగా వంగూరు పాండు,జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కృష్ణంరాజు ఎన్నికయ్యారు .కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కమిటీ సభ్యులు కొండవీటి మధుసూదన్ రెడ్డి, మల్లికార్జున మల్లారెడ్డి, సింగన బోయిన సత్యనారాయణ, మల్లికార్జున్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలకూర వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.త్వరలో జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్ కమిటీలు పూర్తిస్థాయి జిల్లా కమిటీ నియామకం జరగనున్నదనీ ఆయన తెలియజేశారు.



## ఎల్లారెడ్డి లో బస్ డిపో ఏర్పాటుకు మంత్రికి వినతిపత్రం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయం న్యూస్):- ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నిత్యం వందలాది మంది జీవనోపాధికోసం పల్లెల నుంచి పట్టణానికి వచ్చే వారికోసం సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో 40 సంవత్సరాల నుండి ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు పడుతున్న కష్టం తీరాలనే ఉద్దేశంతో ఎల్లారెడ్డి లో నూతన బస్ డిపో ఏర్పాటు చేయాలనీ, ప్రతి మారుమూల గ్రామాలకు బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతూ రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారికి వినతి పత్రం అందించిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్.

## బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలి

## బిజెపి ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాతకోట సురేష్



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం దేశంలో ఇదే తొలి కుల గణన అని గొప్పలు చెప్పుకుంటుందని బిజెపి ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి పాతకోట నరేష్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిన్న అసెంబ్లీలో ప్రకటించినటువంటి కులాల వారి వివరాలు అన్ని కులాలను తక్కువ చేసి చూపించడం జరిగిందని, ముఖ్యంగా బీసీ కులాలను తక్కువ చేసి చూపించడం ప్రభుత్వం యొక్క ఉద్దేశం ఏమిటో అర్థమవుతుందని వారు స్థానిక మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో తీవ్రంగా విమర్శించడం జరిగింది.ముస్లింలను, ముస్లిం బీసీలుగా చిత్రీకరించడం అంటే ఈ యొక్క ప్రభుత్వానికి బీసీల పైన ఉన్నటువంటి ప్రేమ ఎలాంటిదో అర్థమవుతుందని వారు మీడియా సమావేశంలో తెలియజేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం చెప్పిన విధంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక ఎన్నికలకు వెళ్లాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం



బీర్కూర్, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):ఈ రోజు "జాతీయ నులి పురుగుల వ్యాధి నిర్మూలన దినోత్సవం' (నేషనల్ డెవర్మింగ్ డే )పై మండలంకు సంబందించిన అధికారులు తో టాస్క్ ఫోర్స్ మీటింగ్, ఎంపీడీఓ ఆఫీస్ నందు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ ప్రోగ్రాం 10/2/2025(సోమవారం) నాడు, ప్రతి అంగన్వాడీ స్కూల్స్ లలో, ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ లలో, మరియు కాలేజీ లలో 1 టూ 19 %ఎతీం% గల పిల్లలు అందరికి, ఆల్బండాజోలు మాత్రలు తినిపించడం, జరుగుతుంది.కావున ఈ రోజు అందరు పిల్లలు పాఠశాల లలో ఉండున్నట్లు చూసుకోగలరు.ఈ రోజు మాత్రలు వేసుకొనని వారికి 17/2/2025 రోజున మాత్రలు వేయడం జరుగుతుంది.ఈ మీటింగ్ కు, ఎంపీడీఓ సార్, ఎం ఆర్ ఓ మేడం, ఎం ఈ ఓ సార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారు, సి హెచ్ ఓ , సూపెర్వైజర్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



## భారతీయ దళిత సాహిత్య అకాడమీ సావిత్రిబాయి పూలే ఫెలోషిప్ అవార్డుకు ఎంపికైన కంకణాల మౌనిక రాజు

గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) స్థానిక రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కంకణాల మౌనిక రాజు గత పది సంవత్సరాల నుండి విస్తృతమైన సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ పేదవారికి అండదండగా నిలుస్తూ చదువులకు విద్యాదానం ఫీజులు కడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న గుర్తింపుగా మహిళ అభ్యున్నతి కోసం ఇంకా పనిచేయాలని ఉత్సాహం కలగడానికి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు డాక్టర్ పసుల రామ్మూర్తి తెలిపారు భారతీయ దళిత సాహిత్య అకాడమీ.సావిత్రిబాయి పూలే...ఫెలోషిప్ అవార్డుకు ఎంపికైన కంకణాల మౌనిక రాజు.



## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో హంపి పీఠాధిపతి ప్రత్యేక పూజలు

శుభోదయం ప్రతినిధి శంకర్‌పల్లి: ఫిబ్రవరి 05: శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో బుధవారం హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి మహాస్వామి స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సాయిశివ పీఠాధిపతికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టిటిడి మాజీ సభ్యుడు శివకుమార్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## విజయవంతమైన స్కేటింగ్ క్రీడాకారులకు బీజేపీ నేత కందుల సంధ్యారాణి ఘన స్వాగతం..!




రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) తమిళనాడు లోని మధురైలో 24%ష్ట% నేషనల్ స్పీడ్ స్కటింగ్ చాంపియన్ షిప్ 2025 పోటీలు జరుగగా స్కేటింగ్ పోటీల్లో విజయాన్ని సాధించి మొదటి సారి గోదావరిఖని ప్రాంతానికి విచ్చేసిన విద్యార్థులకు బీజేపీ రామగుండం ఇన్‌చార్జ్ కందుల సంధ్యారాణి ఘనంగాస్వాగతం పలికి శాలువాతోసన్మానించారు .ఈసందర్భంగాసంధ్యారాణి మాట్లాడుతూ 24 నేషనల్ స్పీడ్ స్కటింగ్ 2025 తమిళనాడు స్టేట్ లోని మధురైలో నిర్వచించగా,అందులో మన తెలంగాణ టీమ్ 4స్థానం దక్కించుకున్నందుకు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేసారు.విజేతల విజయాన్ని ప్రశంసిస్తూ, క్రీడలు శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమని ఆమె అన్నారు.మన ప్రాంతానికి చెందిన విద్యార్థులు స్కేటింగ్‌లో ప్రతిభ కనబరచి గెలుపొందడం గర్వకారణం అని, క్రీడల్లో భాగస్వామ్యం విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది అన్నారు. బీజేపీ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉంది" అని తెలిపారు.మన తెలంగాణ రాష్ట్రం నుండి 38 మంది విద్యార్థులు పాల్గోనగా, అందులో మన గోదావరిఖని ప్రాంతం నుండి తెలంగాణ స్టేట్ సెక్రటరీ తరుణ్ కిషోర్ మరియు ఎస్ టి కే అకాడమీ కోచ్ రామ్ విఘ్నేష్ అధ్వర్యంలో 8 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని పలువురు విద్యార్థులు మెడల్స్ సాధించడం%జరిగిందన్నారు.శ్రీనిధి, గీతిక్, సాయి రశిత గోల్డ్ మెడల్స్ సాధించగా సహస్ర,అక్షయసాయి,హ్మాన్నా, అకీరా నందన్,సాయి రశిత బ్రౌన్ మెడల్స్ సాధించారనీ తెలియజేసారు.ఇందులో అకీరా నందన్, సాయి రశిత విద్యార్థులు ఇంటర్ నేషనల్ కి సెలక్ట్ కావడం విశేషం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తెలంగాణ స్టేట్ సెక్రటరీ తరుణ్ కిషోర్ మరియు ఎస్ టీ కే అకాడమీ కోచ్ రామ్ విఘ్నేష్ గర్లని అభినందించారు.ఈ కార్యక్రమంలో బిజెపినాయకులు మెరుగు హనుమంతు గౌడ్, కోమల మహేష్, కుర్ర రాజేందర్, రాకేష్, పవీణ్, అపర్ణ, పద్మ మచ్చవిశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.




## ఎస్‌సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదించినందుకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, మరియు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గారికి చిత్రపటాలకు పాలాభిషేకం మరియు బాణాసంచా కాల్చి సీట్లు పంపిణీ



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) విషయ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ద్వారా దళితుల జీవితాల్లో చీకటి తొలగిన రోజు దళిత జీవితాల వర్గీకరణ ద్వారా వెలుగులు నింపిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు గారికి, రామగుండం శాసనసభ్యులు శ్రీ మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గార్ల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగింది.అనంతరం బాణాసంచా కాల్చిమిఠాయిలు పంపిణీ చేయడం



జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మేయర్ బంగి అనిల్ కుమార్, మహంకాళి స్వామి గారు హాజరై మాట్లాడుతూ గత 30 సంవత్సరాల పోరాటం ద్వారా ఎన్నో ఉద్యమాలు చేసిన ఘనత మందకృష్ణమాదిగదేనని వారు కొనియాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



గారు ఇచ్చిన మాట ప్రకారం బిల్లును ఆమోదించడం జరిగింది. వర్గీకరణ దేశంలోనే మొట్టమొదటిసారిగా చేసిన రాష్ట్రంగా చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి దక్కుతుంది. ఎస్‌సీ వర్గీకరణకు కమిషన్ ఇచ్చిన సూచన మేరకు తదుపరి చర్యలు చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ అని, దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్ అని, దశాబ్దాలుగా వర్గీకరణ కోసం మాదిగ మరియు మాదిగ ఉపకులాలు ఎదురు చూస్తున్నాయన్నారు. ప్రభుత్వం తీసుకునేనిర్ణయాలకు ప్రజలు సహకరించాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## : మోత్కూర్ లో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రోడ్డు కాంట్రాక్టర్ అధికారులు



మోత్కూరు మండల రిపోర్టర్ ( శుభోదయం న్యూస్ )మోత్కూర్ మున్సిపాలిటీలోని ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో, కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలేష్ అన్నారు. బుధవారం మోత్కూర్ లో విలేకరులతో మాట్లాడుతూ మోత్కూర్ మున్సిపాలిటీలో రోడ్డు పనులు ప్రారంభమై సంవత్సరం గడిచిన, పెద్ద చెరువులోకి వచ్చే వరద కాల్వ పై వున్న కల్వర్టు విస్తరణ పూర్తి చేయకుండానే అసంపూర్తిగా వదిలేశారన్నారు. పట్టణంలో కొనసాగుతున్న బిటి రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, వారు ఆరోపించారు. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో సూచిక బోర్డు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొన్ని చోట్ల గతంలో ఉన్న పాత బీటీ రోడ్డును తొలగించకుండా దాని పైనుండే నూతన బీటీ రోడ్డు పనులు కొనసాగిస్తున్నారని అన్నారు. ఇలా వేసిన రోడ్డు ఎన్ని రోజులు ఉంటుందని ప్రశ్నించారు. గత రెండు రోజుల క్రితం మోత్కూరు పెద్ద చెరువు కట్ట దగ్గర బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని, రోడ్డు వెడల్పు అనుగుణంగా కల్వర్టు విస్తరించకపోవడంతో వాహనదారులు కాలువలో పడి ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉందన్నారు. అయినా సూచిక బోర్డు ఏర్పాటు చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేసారని అన్నారు. వెంటనే కాంట్రాక్టర్లు, అధికారులు స్పందించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## సెక్రటేరియట్ ముందు ఉరితాల్లతో ముట్టడి నిరసన తెలిపిన సర్పంచ్ లను అరెస్టు




మోత్కూర్ మండల రిపోర్టర్ ( శుభోదయం న్యూస్) సెక్రటేరియట్ ముందు అరెస్టు అయిన రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ,ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య బత్తిని తిరుమలేష్ ఎలుగు సోమయ్య వర్రె శ్రీనివాస్ దండబోయిన మల్లేష్ లను అరెస్టు చేసి చంద్రాన్ గుట్ట కంచన్బాగ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చేసుకొనిగత 13 నెలలుగా అనేక రకాలుగా సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఉద్యమాలు చేస్తున్నం బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు ఇలా ప్రభుత్వము కళ్ళు మూసుకొని రాక్షస ఆనందం పొందుతున్నారు మా బిల్లులు ఇవ్వాలని ఎవరిని ఇబ్బంది పెట్టకుండా శాంతియుతంగా గాందేయ మార్గంలో నిరసనలు మేము ధర్నాలు రాస్తారోకోలు చేస్తుంటే ముందస్తు అక్రమ అరెస్టులు చేస్తున్నారు అయ్యా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పంచాయితీ రాజ్ మినిస్టర్ సీతక్క మా బిల్లులు ఇచ్చిన తర్వాతనే స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాంలిఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులను అరెస్టు చేయడం ప్రభుత్వం చేత గాని తనంగా భావిస్తున్నాం, ప్రజా పాలన అంటే ఇదేనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గ్రామాల్లో పనులు చేసి బిల్లులు రాక అప్పుల పాలైతే మాకు ఇచ్చే గౌరవం ఇదేనా ప్రజలు అన్నీ గమనిస్తున్నారు పల్లెలె పట్టణాలకు పట్టుకొమ్మలు అన్నారు కానీ ఈరోజు పల్లెలన్నీ మురికి కొంపలుగా మారాయి మీకు చిత్తశుద్ధి ఉంటే ముందు పల్లెలను అభివృద్ధి చేయండి కానీ మీ అక్రమ అరెస్టులకు మేము సర్పంచ్ లము భయపడేది లేదు మా బిల్లులు వచ్చేదాకా సర్పంచులము పోరాడుతూ ఇంకా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం అని అన్నారు.

## కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక - రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 2025 ఫిబ్రవరి 5న జరిగే రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమం



మోత్కూర్ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్) కేంద్ర బిజెపి ప్రభుత్వ రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలు మరియు కేంద్ర బడ్జెట్లో పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇచ్చి సంపద సృష్టికర్తలైన కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలకు తగిన బడ్జెట్ కేటాయించకుండా దేశ సంపదను లూటీ చేసే విధానాలను నిరసిస్తూ 2025 ఫిబ్రవరి 5న జరిగే నిరసన కార్యక్రమంలో భాగంగా ఈరోజు సి.ఐ.టి.యు మరియు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంయుక్తంగా మోత్కూర్ లో స్థానిక అంబేద్కర్ చౌరస్తా లో బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి గారు, మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్, పేదల కార్మికుల పొట్ట,కొట్టి ధనవంతులకు మేలు చేసే విధంగా బడ్జెట్ ఉందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జీవోను తగలబెట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు రాచకొండ రాములమ్మ గారు,గుండు లక్ష్మి, చేనేత సంఘం జిల్లా నాయకులు కూరపాటి రాములు గారు,సి.ఐ.టి.యు జిల్లా నాయకులు కూరెళ్ళ నరసింహా గారు, ఎండి లతీఫ్ గారు, మేడి శ్రీను, కూరెళ్ల రోశయ్య, తొంట కృష్ణ,కూరెళ్ళ ముత్తయ్య, అభినయ్, లేగ విజయ, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జోరుగా పేకాట

### బీర్కూర్, బిచ్కుంద, పోతంగల్, నసుర్లబద్, సరిహద్దు మంజీర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జూదం



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పలు చోట్ల పేకాట స్థావరాలు జోరుగా నిర్వహిస్తున్నారని విమర్శలు లేకపోలేదు, కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలం, మంజీరా నది సరిహద్దు ప్రాంతంలో అదేవిధంగా బిచ్కుంద మంజీరా సరిహద్దు ప్రాంతానికి అనుకొని పేకాట స్థావరాలు కొంతమంది జోరుగా నిర్వహిస్తున్నారని లక్షల్లో ఈ ఆటలు నిర్వహిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కిష్టాపూర్ శివారు ప్రాంతం తో పాటు నసుల్లాబాద్ మండలం వ్యవసాయ భూములకు ఆనుకొని పేకాట జోరుగా నిర్వహిస్తున్నారని, పేకాట ఆడే నిర్వాహకు లతోపాటు పలుచోట్ల కొనసాగే వివరాలు హండ్రెడ్ కు డయల్ చేయగా పోలీసులు స్పందించి అక్కడికి వెళ్లడం జరిగింది. చాలా చోట్ల పేకాట కొనసాగుతుందని తాము ఎన్నోసార్లు రైడింగ్ చేయడానికి పోతే దొరకడం లేదని పోలీసులు చెప్పడం, అయినప్పటికీ పేకాట స్థావరాలపై గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం లోని సాలంపాడు గ్రామ రహస్య ప్రదేశంలో పేకాట స్థావరాలు నిర్వహిస్తుండగా అదేవిధంగా, బోధన్ పట్టణానికి ఆనుకొని ఉన్న బెల్లాల్ సరిహద్దు ప్రాంతంలో నల్లల వాగు వద్ద పేకాట స్థావరాలు ఏళ్ల నుంచి కొంతమంది నిర్వహిస్తున్నారని పేరుతో సహా 100కు డయల్ చేయగా స్పందించి అక్కడికి వెళ్లడం జరిగిందని పోలీసులు తెలిపారు. పోతంగల్ మండలం కల్లూరు గ్రామ శివారు ప్రాంతంలో సైతం పేకాట స్థావరం కొనసాగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. తెలియకుండా ఒక కూలీలను నియమిస్తున్నారని ఒక్కొక్క కూలికి 2000 నుంచి 3000 రూపాయలు కూలి డబ్బులుగా ఇస్తున్నారని పేకాట ఆడడానికి వచ్చిన పేకాట రాయులకు సర్వం మందు విందు తో పాటు అన్ని సకల సౌకర్యం పేకాట స్థావరం వద్ద ఏర్పాటు చేస్తున్నారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. వడ్డీతో అప్పులు ఇచ్చేవారు కూడా ఫైనాన్స్ నిర్వాహకులు కూడా పేకాట స్థావరం వద్ద ఉంటూ, డబ్బులు కోల్పోయిన వారికి వారి విలువైన వస్తువులు అధిక వడ్డీతో తాకట్టు పెట్టుకుని లేదా ఒక తక్కువ గడువు ఇచ్చి డబ్బులు ఇస్తూ, పేకాట ఆడే వారి జీవితాలతోపాటు పేకాట రాయల కుటుంబాలను విచ్చినం చేస్తున్నారని ఓవైపు అప్పుల వారు మరోవైపు ఫైనాన్స్ నిర్వాహకులు మరోవైపు పేకాట నిర్వాహకులు, పేకాటకు ఆడడానికి వచ్చిన వారి జీవితాలను కుటుంబాలను విచ్చినం చేస్తున్నారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. పేకాట ఆడడానికి మహారాష్ట్ర కర్ణాటక తో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలు హైదరాబాద్ పట్టణంతో పాటు వివిధ పట్టణల కు చెందినవారు పేకాటరాళ్లు భారీ మొత్తంలో వస్తూ పేకాట ఆడుతున్నారని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వీటిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## తహసీల్దార్ ను కలిసి సత్కరించిన టీడీపీ నేతలు



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : మండల తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా తహసీల్దార్ బాధ్యతలు చేపట్టిన అర్జున్ నాయక్ ను మండల తెలుగుదేశం పార్టీ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం పలు గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు , ప్రజా సమస్యలను తహసీల్దార్ దృష్టికి వారు తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కార్యాలయంలో ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా టీడీపీ నేతలు తహసీల్దారును కోరారు. కార్యాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి త్వరితగతిన ప్రజలకు సేవలు అందేలా రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతామని తహసీల్దార్ వారికి తెలిపారు. తహసీల్దార్ ను కలిసి వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, సుమంత్ రెడ్డి, బోడపాటి రామకృష్ణ, ప్రభురాజు, పుల్లారెడ్డి,రాయపురెడ్డి, జోసెఫ్ రెడ్డి, లింగయ్య తదితరులు ఉన్నారు.

## ఘనంగా పల్నాటి గాంధీ 'నాళం మట్టపల్లి' వర్ధంతి వేడుకలు



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : పల్నాటి గాంధీగా పేరొందిన నాల మట్టపల్లి 64 వ వర్ధంతి వేడుకలను మండల కేంద్రమైన రెంటచింతలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం సెంటర్లోని మట్టపల్లి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ గాంధీజీ ప్రబోధాలకు అనుగుణంగా సంఘ సంస్కరణ కార్యక్రమాలు చేపట్టి స్వాతంత్ర్య కాలంలో పల్నాట జరిగిన పలు ఉద్యమాల్లో పాల్గొన్న సమరయోధుడు మట్టపల్లి అన్నారు. కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో సంఘాన్ని సంస్కరించే బాటలో తన కుమార్తె వితంతు వివాహాన్ని జరిపించి ఆచరించిన సంఘసంస్కర్తగా మట్టపల్లి ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ సందర్భంగా సీనియర్ టీడీపీ నేత గొంటు ఆదిరెడ్డి చే ఆరుగురు పేద విద్యార్థులకు రూ.4 వేలు చొప్పున, పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని ఆర్థిక సాయంగా నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఏచూరి వెంకట సైదయ్య, ఎస్ మోహన్, రామావత్ బిక్షాలు, కట్టమూరి నాగేశ్వరరావు, గుండా రామ్మూర్తి, ఆకుల నరసింహారావు, నారాయణపురం శ్రీనివాసరావు, గాదె మర్రెడ్డి, బ్రహ్మం నిర్వాహకులు నాళం నరసింహారావు, పెదబాబు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## తలుపుల ఎంపీడీవో

### రాము నాయక్ కరువు పనులులను తనిఖీ చేయడం జరిగింది...



ఉమ్మడి అనంతపురం జిల్లా బ్యూరో - నరేంద్ర (శుభోదయం న్యూస్) : సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం తలుపుల మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కరువు పని చేయించడం జరుగుతుంది. ఎంపీడీవో రాము నాయక్ కరువు పనులు ఎలా చేయిస్తున్నారు,అని ఆయన తనిఖీ చేయడం జరిగింది. అలాగే కరువు పనికి ఎంతమంది వస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ లను అయన అడగడం జరిగింది. ఎంపీడీవో రాము నాయక్ మస్టర్ల లోని కొన్ని పేర్లు చదివారు. ఆ పేర్లు చదివిన వారు వస్తున్నారా లేదా అని మాస్టర్లు లను చెక్ చేయడం జరిగింది. కరువు పనికి వచ్చిన కూలీలను మీరు గుంతను పొడవు,వెడల్పు,లోతు ఎన్ని మీటర్లు తీస్తున్నారని అని అడగడం జరిగింది. అలాగే కరువు పని కూలీలను మీరు తిన్నారా లేదా తినడానికి భోజనం తెచ్చుకున్నారా, తాగడానికి నీళ్లు తెచ్చుకున్నారా అని వాళ్లని ఆయన అడగడం జరిగింది.

## చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావుని పరామర్శించిన బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన శ్రీనివాస్ (శుభోదయం న్యూస్): టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు మరియు చీపురుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే కళా వెంకటరావు గారి సోదరులు కిమిడి సత్యనారాయణ నాయుడు ఇటీవల అకాల మరణం చెందడంతో, ఈరోజు రేగిడి గ్రామంలో వారి నివాసం వద్ద కళా వెంకటరావుని, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావుని, కిమిడి రామకృష్ణ నాయుడుని మరియు కీ?శే?శ్రీ



కిమిడి సత్యనారాయణ కుమారులు కిమిడి సూరపు నాయుడుని బొబ్బిలి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి అల్లాడ భాస్కరరావుతో కలిసి పరామర్శించారు.అనంతరం, కీ?శే?శ్రీ కిమిడి సత్యనారాయణ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాన్ని ఆదుకున్న బొబ్బిలి ఎమ్మెల్యే (ఆర్ వి ఎస్ కే కే)రంగారావు బేబీ నాయన



విజయనగరం జిల్లా ప్రతినిధి, బొద్దాన శ్రీనివాస్ (శుభోదయం న్యూస్): బొబ్బిలి మండలం చిత్రకోట బొడ్డవలస గ్రామానికి చెందిన గొట్టాపు నారాయణమ్మ (భర్త) గొట్టాపు.సింహాచలం ఇద్దరూ అనారోగ్యంతో బాధపడుతున్నారని ఫేస్బుక్ లో తన కుమారుడు, గొట్టాపు.శ్రీను మెసేజ్ పెట్టడంతో తక్షణమే స్పందించిన బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే రంగారావు బేబీ నాయన. వారికి, ఆర్థిక సాయం 10వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతూ జీవితాంతం రుణపడి ఉంటామని వారు మనస్ఫూర్తిగా (శుభోదయం పత్రిక)ముందు తెలియజేశారు.

## నిరుపేదల కుటుంబాలకు కూరగాయలు పంపిణీ కార్యక్రమం

### మదర్ థెరిసా ట్రస్ట్ నిర్వహకులు క్లైవ్...



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన శ్రీనివాస్. (శుభోదయం న్యూస్): విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపాలిటీలో ఉన్నటువంటి ఇందిరమ్మ కాలనీ లో మదర్ థెరిస్సా ట్రస్ట్ నిర్వాహకులు క్లైవ్ పేదవాళ్ళకి కూరగాయల్ని పంపిణీ కార్యక్రమం జరిగింది. అలాగే పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు చాక్లెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో క్లైవ్ గారితో పాటు శ్రీనివాసరావు, ప్రశాంతి,జోసెఫ్, పోలీస్ పాల్గొనడం జరిగింది.మీరు కూడా మీ వంతు సహకారాన్ని అందించాలంటే ఈ 9493035443 నంబరుకు సంప్రదించగలరు.

## మారెళ్ళలో రసవత్తంగా సాగిన రాతిదూలం లాగుడు పోటీలు



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోని మారెళ్ళ గ్రామంలో బాబా మస్తాన్ వలి స్వామి ఉరుసు సందర్భంగా బుధవారం నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు రసంతంగా సాగాయి. ఈ పోటీలను పత్తికొండ రూరల్ సిఐ పులి శేఖర్, మాజీ ఎంపిటిసి ఈడిగ వెంకట్ రాముడు, సర్పంచ్ సలహాదారుడు సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు ఎద్దులదొడ్డి శ్రీనివాస్ గౌడ్ లు ప్రారంభించారు.ఈ సందర్భంగా రూరల్ సిఐ పులి శేఖర్ మాట్లాడుతూ బాబా మస్తాన్ వలి ఉరుసుకు వచ్చిన భక్తులకు, బంధువులకు వినోదం కలిగించేందుకు గ్రామస్తులు చాలా చక్కగా రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. అలాగే పాత సాంప్రదాయాలను మరవకుండా ఈ పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు.ఈ పోటీలలో విజేతైన వృషభ యజమానులకు రూ 30 వేలు, రూ 20 వేలు,రూ 15 వేల, రూ 10 వేలు, రూ 5 వేలు నగదును దాతలు అందజేశారు.

## మారెళ్ళలో ఘనంగా జరిగిన బాబా మస్తాన్ వలి స్వామి ఉరుసు...

తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోని మారెళ్ళ గ్రామంలో బాబా మస్తాన్ వలి స్వామి ఉరుసు బుధవారం ఘనంగా జరిగింది. కొన్ని సంవత్సరాల నుండి బాబా మస్తాన్ వలి స్వామి ఉరుసు ను భక్తులు నిర్వహిస్తూ ఉన్నారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం వేలాదిమంది భక్తులు బాబా మస్తాన్ వలి స్వామి దర్గాను దర్శించుకుని తమ మొక్కలు తీర్చుకున్నారు. అలాగే భక్తులు దర్గా ఆవరణంలో కందూరు చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా సర్పంచ్ సలహాదారుడు సుధాకర్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు దారపనేని, బైరెడ్డి కృతజ్ఞతలు



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని దారపనేని క్యాంపు కార్యాలయంలో బుధవారం పత్రిక విలేకరుల సమావేశంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. 2018, 19 ఆర్థిక సంవత్సరంలో తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీకి రోడ్లకు సంబంధించి 93 లక్షలు ఉపాధి హామీ విధులతో మంజూరు చేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారటంతో ఆ రోడ్ల నిర్మాణ పనులు అర్ధాంతరంగా



నిలిచిపోయినాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రతిపాదనలతో పామూరు ఏఇ, కనిగిరి డిఇ, కందుకూరు ఇఇ ఒంగోలు ఎస్ సి డ్వామ పిడి ప్రతిపాదనలతో ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరిగినది. దీనిపైన తూర్పు కోడిగుడ్లపాడు టు బొందల్ రోడ్డు, 20 లక్షలు, తూర్పు కోడిగుడ్లపాడు వరవరోడ్డు టు వయా కుమారస్వామి ఇంటి మీదుగా ఎన్జీవో కాలనీకి 73 లక్షల 30 వేలు నిధులతో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా ఎం జి ఎన్ ఆర్ ఇ జీ ఎస్ రూరల్ డెవలప్ మెంట్ అదనపు కమిషనర్ ఎం శివప్రసాద్ ని కలిసి కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ప్రతిపాదనలు అందజేశారు. స్పందించిన ఆయన త్వరలో అనుమతులు ఇస్తానని హామీ ఇచ్చినట్లు దారపనేని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య,తూర్పు కోడిగుడ్లపాడు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు దారపనేని రాజేంద్రప్రసాద్, నరసింహనాయుడు, పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకటసుబ్బయ్య సుబ్బయ్య, పోకా నాయుడు బాబు, యరసింగ్ రాయుడు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం




దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్) : ప్రకాశం జిల్లా దోర్నాల మండలం, :05.02.2025 న దోర్నాల మండలంలోని అయినముక్కల, తిమ్మాపురం గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ వ్యవసాయ శాఖలో అమలు అవుతున్న పథకలైన ఈ పంట నమోదు, పీఎంకిసాన్, పసల్ భీమా పథకం, రైతు గుర్తింపు కార్డులు గురించి రైతులకు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వి ఎ ఎ శివ నాయక్, వి హెచ్ ఎ సుస్మిత మరియు ఆయన ముక్కుల గ్రామం రైతులు తిమ్మాపురం గ్రామం రైతులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో ఫుడ్ సేఫ్టీ అధికారి



నూజివీడు ప్రతినిధి ఫిబ్రవరి 5. శుభోదయం న్యూస్: ఏలూరు ఫుడ్ సేఫ్టీ అధికారిని కావ్య రెడ్డిని వలపని పెట్టుకున్న ఏసీబీ అధికారులు. 15000 నగదు స్వాధీనం. అధికారితో పాటు ఆఫీసర్ సబర్డి నెట్ పుల్లారావు అరెస్ట్. దాడిలో ఏసీబీ డిఎస్పి పాల్గొన్నారు.

# వైభవంగా జరిగిన మాజీ మంత్రి మాగంటి బాబు జన్మదినం

## ఆశాజ్యోతి 4 లక్షలు విరాళం అందించిన మాగంటి అభిమానులు




దెందులూరు ఫిబ్రవరి 5. శుభోదయం న్యూస్: మనం సంపాదించిన దానిలో కొంత మొత్తం సేవా కార్యక్రమాలకు వినియోగించాలని లేకుంటే మానవ జన్మకు సార్ధకత లేదని విశ్వ హిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ, ప్రముఖ పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్ కుమార్ అన్నారు. బుదవారం ఉదయం హనుమాన్ జంక్షన్ లోని ఆశాజ్యోతి హెండీ క్యాపెడ్ వెల్ఫేర్ సొసైటీ లో దివ్యాంగుల సమక్షంలో మాజీ మంత్రి , తెలుగు దేశం పార్టీ నాయకులు మాగంటి బాబు 65వ జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పుట్టగుంట సతీష్ కుమార్ మాట్లాడుతూ హనుమాన్ జంక్షన్ ఆశాజ్యోతిలో దివ్యాంగ పిల్లల మధ్య తన పుట్టినరోజు జరుపుకోవాలని అనుకోవటం హర్షించదగ్గ విషయం అని అన్నారు. ముందుగా మాగంటి బాబు, సతీమణి మాగంటి పద్మవల్లి దేవి , పుట్టగుంట సతీష్ కుమార్ ఆశాజ్యోతి లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తనకు పూల మాలలు బోకే లు అందించే వారికి ఆంక్షలు విధించారు. తనకు ఎవరు పూలమాల వేయాలన్న ముందుగా ఏర్పాటు చేసిన ఆశాజ్యోతి నిధికి ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. ఆ రూపేణా ఒక్క గంటలో 4 లక్షల రూపాయల నిధి ఏర్పడింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన మాగంటి బాబు అభిమానులు ఆయనను నిలువెత్తు పూల దండలతో, శాలువాలతో సన్మానించారు. దివ్యాంగా పిల్లలకు స్వయంగా అల్పాహారం తినిపించారు అందజేశారు. మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి డైరెక్టర్ , సెక్రెటరీ మరీదు మాధవీ లత, వ్యవస్థాపకులు మరీదు వెంకటస్వామి, తెలుగు దేశం పార్టీ నాయకులు అక్కినేని చందు, కాపా శ్రీనివాసరావు, నూతక్కి వేణు, వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి, పావులూరి రామారావు, బెక్కం శ్రీనివాసరావు, గారపాటి రామసీత , గారపాటి భాస్కరరావు , రామ్ కుమార్ , రామ్ లక్ష్మణ్ , జన సేన నాయకులు గరికపాటి నాగేశ్వరరావు, విజయవాడకి చెందిన కాకార్ల శంకరరావు మాగంటి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆశా జ్యోతి కి లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. అలాగే నూజివీడు కు చెందిన కాపా శ్రీనివాసరావు 50,000 వేల రూపాయలు ప్రకటించగా గన్నవరం కు చెందిన చిట్టూరి ఛాయాదేవి 50.000 వేల రూపాయలు విరాళం ప్రకటించారు. ఇంకా ఈ కార్యక్రమంలో లయన్ నందిగ%శీ% స్వామి , లయన్ గోగినేని శ్రీధర్, లయన్ తాడి రంగారావు, లయన్ అట్లూరి శ్రీనివాసరావు , లయన్ లింగం స్వామి వెంకట్, లయన్ భూమా సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతి లోని దివ్యాంగులందరికి మాగంటి నూతన వస్త్రాలు అందించి స్వీట్స్, ఫ్రూట్స్ అందించారు.

# కొత్తూరులో కాలిపోయిన వ్యవసాయ 5 బోరు మోటర్లు

పెద్ద దోర్నాల మండల రిపోర్టర్-ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా, పెద్ద దోర్నాల మండలం, కొత్తూరు గ్రామంలో మూడు రోజుల నుండి విద్యుత్తు ఓవర్ లోడ్ తో, విద్యుత్తు రావటము, పోవటము తో పొలాల్లో ఉన్న వ్యవసాయ 5 ఐదు బోరు మోటర్లు కాలిపోయినవి. రైతులు మిర్చి పంటకు పెట్టిన పెట్టుబడులు రాక, మిర్చి కోత కూలీలు కూడా రాకపోవడంతో, మిర్చి క్వింటా 9 వేల రూపాయలు పలకడంతో, మిర్చిని అమ్మిన కోసిన కోత కూలీలు రాకపోవడంతో కొత్తూరు రైతులు కన్నీరు మున్నీరు పెట్టి విలపిస్తున్నారు. అసలే మిర్చికి ధర లేకపోవడంతో, దీనికి తోడు,విద్యుత్తు ఓవర్ లోడు రావడంతో 5 బోరుమోటర్లు కాలిపోవడంతో, మోటర్లు కట్టించేందుకు, డబ్బులు లేక అల్లాడుతున్నామని రైతులు వాపోయారు. పెద్ద దోర్నాల విద్యుత్ సబ్ స్టేషన్ కు కృష్ణారెడ్డి, మరి కొంతమంది రైతులు ఫోన్ చేయగా మేము, ఏమి చేయలేము, పైనుంచి విద్యుత్తు ఓవర్ లోడ్ తో వస్తుంది అని చెప్పినారని కృష్ణారెడ్డి మరియు రైతులు బుధవారం తెలిపారు. విద్యుత్తు ఏడికి కొత్తూరు గ్రామస్తులు, రైతులు, దొందేటి. కృష్ణారెడ్డి మరి కొంతమంది కలిసి ఫోను చేయగా పైనుంచి విద్యుత్ ఓవర్ లోడ్ తో వస్తున్నది వాస్తవమేనని అన్నారని కొత్తూరు గ్రామ రైతులు కృష్ణారెడ్డి లు తెలిపారు. కావున ప్రభుత్వం స్పందించి విద్యుత్ ఓవర్ లోడు, రాకుండా చూడాలని, మిర్చి పంట, బొప్పాయి, అరటి, తదితర పంటలకు నీళ్లు లేక ఎండిపోతున్నాయని రైతులు బాధపడుతున్నారు. కావున సంబంధిత అధికారులు విద్యుత్ ఓవర్ లోడ్ రాకుండా చూసి, యధావిధిగా విద్యుత్తు వచ్చేలాగా చూడాలని కొత్తూరు గ్రామ రైతులు కోరుతున్నారు.

# పి వెంగన్న పల్లెలో గ్రామసభ నిర్వహించిన యాడికి సీఐ

యాడికి ఫిబ్రవరి 05 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ ) జిల్లా ఎస్పీ ఆదేశాల



మేరకు మరియు తాడిపత్రి ఏ ఎస్ పి రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాల మేరకు యాడికి సీఐ ఎం. ఈరన్న బుధవారం ఫ్యాక్షన్ గ్రామమైన పి. వెంగన్న పల్లె గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి, పోలీస్ పికెట్ ను చెక్ చేసి సిబ్బందికి పై అధికారుల ఉత్తర్వులను



తెలియ చేసి, గ్రామంలోని అందర్నీ పిలిపించి గ్రామసభ నిర్వహించడం అయినది. గ్రామంలో ఎటువంటి గొడవలు చేసుకోకూడదని, సమస్యలు ఏమైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని, లేనియెడల వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడమైనదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాడికి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొనడం జరిగింది..

# పెండేకల్లు లో ఉచిత కంటి పరీక్షలు



యాడికి ఫిబ్రవరి 05 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ ) పెద్దపప్పూరు మండల పరిధి లోని పెండేకల్లు గ్రామం లో అంగన్ వాడి కేంద్రం లో తాడిపత్రి డివిజన్ జిపియంవోవో మధుసూదనరాజు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మేరకు 23 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇద్దరికి కంటి ఆపరేషన్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి అవసరమైన మందులు ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమం లో పెండేకల్లు యం.పి.పి.పాఠశాల ప్రధానోపాధ్యాయులుడి.కేశవ రెడ్డి , అంగన్ వాడి టీచర్ యం. శకుంతల, ,ఆయా వీ.ప్రభావతి ,ఆశా కార్యకర్త గట్టు మాణిక్యమ్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# యాడికి ఎమ్మార్వో కార్యాలయాన్ని తనిఖీ చేసిన గుంతకల్ ఆర్టీవో శ్రీనివాసులు....



యాడికి ఫిబ్రవరి 05 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ )మండల కేంద్రం లోని ఎమ్మార్వో కార్యాలయంలో భూముల పట్టాల రీసర్వే గురించి



గుంతకల్ ఆర్టీవో శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు అధికారంలో ఉద్దేశించి మాట్లాడుతూ భూములకు సంబంధించి రీసర్వే సరైన పద్ధతిలో చేయాలని ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఈ సర్వే చేయాలని తెలిపారు. అలాగే కమలపాడు, చింతలాయపల్లి గ్రామాల సరిహద్దులలో నిర్మిస్తున్న పి ఎస్ పి ప్రాజెక్ట్ గురించి డి ఈ ఈ ఏపీ జెన్కో అధికారులతో కలిసి పొలాలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, యాడికి తాసిల్దార్ ప్రతాప్ రెడ్డి యాడికి మండల అధికారులు పాల్గొనడం జరిగింది.

# పశుగణన వెంటనే పూర్తి చేయండి.. పశుసంవర్ధక అసిస్టెంట్ డైరెక్టర్ ఎం రవికుమార్..



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):-పశు వైద్య సిబ్బంది పశుగణన వెంటనే పూర్తి చేయాలని కొండేపి అసిస్టెంట్ డైరెక్టర్ ఎం రవికుమార్ తెలిపారు. మండలంలోని సింగరాయకొండ పశు వైద్యశాల పరిధిలో బుధవారం పొన్నలూరు కొండపి సింగరాయకొండ వసు వైద్య సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోనే సిబ్బంది ప్రతి రైతు పెంచుతున్న పశువులను విధిగా నమోదు చేయాలని సూచించారు.. సీజనల్ గా పశువులకు జీవాలకు వచ్చే వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు చేయాలని సూచించారు. పశువులు జీవాలకు షెడ్డు ల నిర్మించుకోనేలా రైతులకు సూచించాలని తెలిపారు. బహువర్షిక పశుగ్రాసాలు ప్రభుత్వ సబ్సిడీతో పెంచుకోవచ్చని వివరించారు.. ప్రభుత్వం అందజేస్తున్న అన్ని రాయితీ పథకాలను పశు జీవాల పోషకులకు తెలపాలని కోరారు.. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పశు వైద్య శిబిరాలు స్పందన గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న పశు మరియు జీవాల ఆరోగ్య నిర్ధారణ పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ కొండేపి పొన్నలూరు మండలాల పశు వైద్యులు హాజరత్తయ,పేరయ్య, చంద్రశేఖర్ శివరామకృష్ణ కోటేశ్వరరావు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు..

# మానుగుంట మహీధర్ రెడ్డిగారిని కలిసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆదాల ప్రభాకర్ రెడ్డి



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ - శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):కందుకూరు మాజీ శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డిని ఆయన నివాసంలో నెల్లూరు పార్లమెంట్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, ఇంకా పలు అంశాలపై ఇద్దరిమధ్య చర్చ జరిగినట్టు సమాచారం. కొంతకాలంగా వైసీపీకి దూరం పాటిస్తున్న మహీధర్ రెడ్డితో ఆదాల ప్రభాకర్ రెడ్డి సమావేశం కావడం ఆసక్తికరంగా మారింది. నెల్లూరు విజయ డైయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఇంకా పలువురు నేతలు ఆదాల ప్రభాకరరెడ్డి వెంట ఉన్నారు.

# 2025-26 కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, కార్మిక రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని వీరారెడ్డి అన్నారు



సింగరాయకొండ మండల రిపోర్టర్ పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- 2025 - 26 కేంద్ర బడ్జెట్ లో రైతాంగానికి కార్మిక వర్గానికి కేటాయింపులు తక్కువగా చేసినందుకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దహన



కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి మాట్లాడుతూ నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించకుండా కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చే విధంగా బడ్జెట్ ప్రతిపాదనలో ఉన్నాయని వీరారెడ్డి అన్నారు. గత పది సంవత్సరాల కాలంలో కార్పొరేట్ కంపెనీలకి 20 లక్షల కోట్ల పైగా రుణాలను రద్దు చేశారు. రైతుల రుణమాఫీ డిమాండ్ ను పట్టించుకోలేదని అన్నారు. అప్పుల పాలైన రైతాంగం వ్యవసాయం చేయలేక రోజుకి 31 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. వీరి గురించి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ఆలోచన చేయటం లేదు. నూతనంగా తీసుకొచ్చిన మార్కెటింగ్ చట్టం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకపోగా కార్పొరేట్లు దోపిడీ చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలోని పేదలకు ఆసరాగా ఉండే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజువారి కూలీ 600 గా నిర్ణయించాలని అన్నారు. వీటికి నిధులు పెంచాల్సింది పోగా గత బడ్జెట్ కన్నా కూడా 5 వేల కోట్ల తక్కువగా కేటాయింపులు చేశారని అన్నారు. కార్మిక హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్ కార్డులను రద్దు చేయాలని అన్నారు. ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలను అనుమతించడం ద్వారా దోపిడీకి ద్వారాలు తెరిచినట్లేనని అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులను కేటాయించకుండా లాభాల్లోకి ఏ విధంగా వస్తుందని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల్లో చేర్చామని ప్రకటించినా నిధులు కేటాయింపు లేదు జిల్లా అభివృద్ధి గురించి ఎలాంటి ప్రతిపాదనలు లేవు. పేదల ఆకలి తీర్చడానికి ఎలాంటి ప్రతిపాదనలు లేవు ఈ బడ్జెట్లో. సంపన్నులకు మధ్యతరగతి ప్రజానీకానికి మేలు చేసే బడ్జెట్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గద్దల బాలకోటయ్య, బాలాజీ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు మీరా, వెంకటేశ్వర్లు, కొండయ్య, లక్ష్మయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెపాటి శీనన్న పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఆకుపాటి



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) : ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు గొర్రెపాటి శీనన్న పుట్టినరోజు వేడుకలకు ప్రకాశం జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ మిత్ర బృందం పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా శీనన్నకు శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఇండ్ల నరసింహారావు, గాడి మాలకొండయ్య, పుప్పాల రామ్మూర్తి, టెంకం ప్రసాదు, పసుపులేటి పవన్ కళ్యాణ్, కటకం భాను, తదితరులు పాల్గొన్నారు

# స్మార్ట్ జెన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు స్కాలర్షిప్ టెస్ట్ అవేర్నెస్ ప్రోగ్రామ్




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్) :- స్మార్ట్ జెన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల కోసం స్కాలర్షిప్ టెస్ట్ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల కరస్పాండెంట్ . గీతా రాణి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 8, 2025 (శనివారం) ఉదయం 9:00 గంటలకు స్మార్ట్ జెన్ జూనియర్ కాలేజ్, మూలగుంటపాడు బ్రాంచ్, సింగరాయకొండ నందు జరగనుంది. ఈ పరీక్షకు 10వ తరగతి విద్యార్థులు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా హాజరుకావచ్చని ఆమె తెలిపారు. పరీక్షలో గణితం మరియు సైన్స్ సబ్జెక్టుల నుంచే ప్రశ్నలు అడుగబడతాయి. ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయనున్నారు.ప్రథమ బహుమతి: రూ. 10,000ద్వితీయ బహుమతి: రూ. 5,000తృతీయ బహుమతి: రూ. 3,000అంతేకాక, పరీక్షకు హాజరయ్యే అందరికీ భోజన వసతి (లంచ్) అందుబాటులో ఉంటుందని డా. గీతా రాణి తెలిపారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇది ఓ గొప్ప అవకాశం కాబట్టి, విద్యార్థులు దీనిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# పొగాకు రైతులకు సూచనలు సలహాలు ఇచ్చిన... పొగాకు బోర్డు వేలం నిర్వహణ అధికారి అట్లూరి శ్రీనివాసరావు




టంగుటూరు మండల రిపోర్టర్ : వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) : పొగాకు రైతులకు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందని స్థానిక పొగాకు బోర్డు నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని పొందూరులో బుధవారం జరిగిన పొగాకు రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ..పొగాకు పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే బ్యారన్లో అమర్చాలని పచ్చి ఆకులు ఎండ తగలకుండా జాగ్రత్తపడాలని ఆకులు అల్లినప్పుడు ఎక్కువగా పండిన ఆకులు పక్వానికి వచ్చిన ఆకులు విడివిడిగా కర్రలకల్లుకోవాలని పచ్చి ఆకులు నేలపై కాకుండా టార్పాలిన్ పట్టాలపై దించి అల్లుకోవాలన్నారు. అదేవిధంగా పొగాకు క్యూరింగ్ లో తీసుకోవలసిన మెలకువలు



గురించి ఆయన మాట్లాడుతూ బ్యారన్ లీకేజీలు లేకుండా పొగ గొట్టాలపై ఇనుప జాలి అమర్చాలని తద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. వెంచూరి బిగించడం ద్వారా స్వల్ప ఖర్చు ఆదా చేయవచ్చునని బ్యారన్లో ఉష్ణోగ్రతలు తెలియపరిచే క్యూరోమీటర్ తప్పనిసరిగా అమర్చాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యారన్లో 1000 నుండి 1200 వరకు మించి కర్రలు ఎక్కించరాదన్నారు. అదేవిధంగా పొగాకు మండెలు చేయు విధానం గ్రేడింగ్లో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ప్రధానంగా ఇతర అన్యపదార్థాలైన (ప్లాస్టిక్) తదితరాలు రాకుండా పొగాకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి అట్లూరి సూచించడం జరిగింది. ఇదిలా ఉండగా పొగాకు రైతులందరికీ బెళ్ళకు సంబంధించిన పట్టలు పొగాకు బోర్డు సమకూర్చునని ఈ క్రమంలో రైతులు తప్పనిసరిగా బోర్డు పాస్ పుస్తకాలు కలిగి ఉండాలన్నారు. బ్యారన్లో క్యూరింగ్ చేసే క్రమంలో అగ్ని ప్రమాదాలు జరిగినట్లయితే వెంటనే బోర్డు అధికారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీలకు సంబంధించిన సిబ్బంది మరియు బోర్డ్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ఎమ్మెల్యే బేబీనాయనని కలిసిన విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ ...



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనివాస్. (శుభోదయం న్యూస్):విజయనగరం జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఉప్పలపాటి రాజేష్ వర్మ ఈరోజు సాయంత్రం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన)ని మర్యాదపూర్వకంగా కలిశారు. బొబ్బిలి రాజకుటుంబంతో తమకు ఉన్న అనుబంధం మరియు రాజకీయ పరిస్థితుల గురించి కొంతసేపు ఇరువురు మాట్లాడారు. రాజేష్ వర్మకి ఎమ్మెల్యే బేబీ నాయన బొబ్బిలి వీణను బహూకరించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ మరిశర్ల రామారావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాన్స్ఫార్మర్ ,మోటార్, కేబుల్ వైర్ దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## యాడికి యుపిఎస్ సిఐ ఎం. ఈరన్న



యాడికి ఫిబ్రవరి 05 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్ ): అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మరియు తాడిపత్రి ఏ ఎస్ పి రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాల మేరకు యాడికి సీఐ ఎం. ఈరన్న మరియు సిబ్బంది తోటి మండలంలోని రాయలచెరువు, చందన మరియు దైవాలమడుగు గ్రామాలను రాత్రి సమయంలో సందర్శించి రైతులతో రాత్రి సమయాల్లో జరుగుతున్నటువంటి ట్రాన్స్ఫార్మరుల దొంగతనాలు, మోటారులు మరియు కేబుల్ వైర్లు దొంగతనాల గురించి వివరించి జాగ్రత్తగా ఉండాలని, రాత్రి సమయాల్లో పోలీసులతోపాటు రైతులు కూడా గస్తీ తిరగాలని, రాత్రి సమయాలలో అనుమానాస్పద వ్యక్తులు గాని మరియు క్రొత్త వ్యక్తులు గాని సంచరించినట్లయితే డయల్ 100 కు గాని, పోలీసు వారికి గాని తెలియజేయాలని వివరించడమైనది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాడికి సిఐ ఎం.ఈరన్న పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగాన్ని నష్టం చేసే బడ్జెట్ : ఏపీ రైతు సంఘం

ఆత్మకూరు :కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగాన్ని నష్టం చేసే బడ్జెట్ అని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ .రాజశేఖర్, సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మా భాష, వీరన్న అన్నారు. బుధవారం మండల పరిధిలోని కురుకుంద, వడ్ల రామాపురం, పట్టణంలోని పాత బస్టాండ్ లో వ్యవసాయ రంగానికి నష్టం చేకూర్చే బడ్జెట్ కాపీలను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి గత బడ్జెట్ కన్నా తక్కువగా కేటాయించటం, రసాయనికి ఎరువుల ధరలు పెంచడం జరిగిందన్నారు. పంటల గిట్టుబాటు ధరలపై నరేంద్ర మోడీ ఇచ్చిన వాగ్దానాన్ని దాటీవేయడం జరిగిందన్నారు. ఎల్ఐసి లో 74శాతం నుంచి 100శాతం విదేశీ పెట్టుబడులకు ఆహ్వానించడం, రాష్ట్రానికి రావలసిన విభజన చట్టంలో ఉన్న హక్కులను అమలు చేసే లాగా ఈ బడ్జెట్ లో లేదన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ సిఐటియు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలకు రైతు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు సి. వెంకటేశ్వర్లు, సామేలు, కార్మికులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కుంభమేళాలో ఆకర్షించిన ప్రధాని మోదీ వస్త్రధారణ



పయాగ్‌రాజ్:ప్రధాని మోదీ తాను ధరించే దుస్తుల ప్రత్యేకత గురించి వేరే చెప్పనవసరం లేదు. దుస్తుల విషయంలో ఆయన ఎప్పటికప్పుడు ఫ్యాషన్ ట్రెండ్‌ను అనుసరిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. సంప్రదాయ దుస్తులు ధరించే సందర్భం ఏదైనా ఉంటే ఖచ్చితంగా సంప్రదాయానికి తగట్టు వ్యవహరిస్తూనే ఫ్యాషన్‌ను ఫాలో అవుతుంటారు. బుధవారం(ఫిబ్రవరి5) ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని ఏకంగా మూడు రకాల దుస్తులు ధరించారు. అరాలీ ఘాట్ నుంచి త్రివేణి సంగమానికి బోట్‌లో వెళుతున్న సమయంలో సంప్రదాయ కుర్తా,పైజామా పైన నెహ్రూ జాకెట్ ధరించారు. ఇక త్రివేణి సంగమంలో పవిత్ర స్నానమాచరించే సమయంలో మాత్రం ప్రధాని సంప్రదాయానికి భిన్నంగా అథ్లీజర్ దుస్తులను ధరించారు. మెడలో నీలిరంగు స్కార్ఫ్ వేసుకుని మణికట్టుకు రుద్రాక్ష మాల చుట్టుకున్నారు. స్నానం పూర్తయి హారతి ఇచ్చే సమయంలో కుర్తా,చుడీదార్ పైజామా వేసుకున్నప్పటికీ కుర్తాపై పఫ్ఫర్ జాకెట్ ధరించారు.తలపై రంగురంగుల పహారీ టోపీ ధరించారు. ప్రధాని కుంభమేళా పర్యటన సమయంలో ధరించిన దుస్తుల విషయంలో సోషల్‌మీడియాలో చర్చ జరుగుతోంది.

## రాజ్యసభలో నోరుపారేసుకున్న ఖర్గే.. బీజేపీ ఎంపీ సీరియస్!



ఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహంతో కంట్రోల్ తప్పారు. ఖర్గే ఆవేశంలో బీజేపీ ఎంపీపై విరుచుకుపడ్డారు. నేను మీ తండ్రి సహచరుడిని.. మీరు నాకు చెప్పేదేంటి.. నోరు మూసుకుని కూర్చోండి అంటూ కౌంటరిచ్చారు. దీంతో, ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనంగా మారాయి. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో నేడు రాష్ట్రపతి ప్రసంగానికి రాజ్యసభలో ధన్యవాద తీర్మానంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తున్న సమయంలో మాజీ ప్రధాన మంత్రి చంద్రశేఖర్ కుమారుడు నీరజ్ శేఖర్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆవేశానికి లోనై, సహనం కోల్పోయిన ఖర్గే.. ఆయనపై విరుచుకుపడ్డారు. అనంతరం, ఖర్గే మాట్లాడుతూ..'నేను మీ తండ్రి సహచరుడిని. నువ్వు ఏం మాట్లాడుతున్నావ్?. నేను నిన్ను చిన్నప్పటి నుంచీ చూస్తున్నాను. నోరు మూసుకుని కూర్చో' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఖర్గే వ్యాఖ్యల కారణంగా రాజ్యసభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ కల్పించుకున్నారు. ఇరు వర్గాలను ప్రశాంతంగా ఉండాలని కోరారు. మాజీ ప్రధానమంత్రి గురించి తన ప్రస్తావనను ఉపసంహరించుకోవాలని ఖర్గేకు సూచించారు. అలాగే, చంద్రశేఖర్ ఎంతో ప్రజాదరణ కలిగిన నేత అని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా.. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మాజీ ఎంపీ నీరజ్ శేఖర్ 2019లో బీజేపీలో చేరారు. ఆయన తండ్రి చంద్ర శేఖర్ దేశ రాజకీయ చరిత్రలో ముఖ్యమైన సోషలిస్ట్ నాయకులలో ఒకరిగా పరిగణించబడతారు. చంద్ర శేఖర్.. అక్టోబర్ 1990 నుండి జూన్ 1991 వరకు ఆరు నెలలు ప్రధానమంత్రిగా పనిచేశారు.

## విజయవాడ నేతలతో వైఎస్ జగన్ సమావేశం




గుంటూరు, : విజయవాడ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్పొరేటర్లతో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భేటీ అయ్యారు. బుధవారం ఉదయం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వాళ్లతో ఆయన తాజా రాజకీయ పరిణామాలను చర్చిస్తున్నారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఎలాంటి కుట్రలకు దారి తీసిందో తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లలో ఆందోళన నెలకొనగా, వారికి భరోసా ఇచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారాయన. ఒకవేళ అలాంటి పరిస్థితి ఎదురైతే.. వ్యూహాత్మకంగా ఎలా వ్యవహరించాలో ఆయన దిశానిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లతో పాటు మేయర్ భాగ్యలక్ష్మి, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్, పోతిన మహేష్ తదితరులు హాజరయ్యారు. ని

## కలవరపెడుతోన్న ఎయిమ్స్ ఫ్యాకల్టీ కొరత : జైరాం రమేశ్



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రుల్లో ఉన్న ఫ్యాకల్టీ కొరత కలవరపెడుతోందని కాంగ్రెస్ ఎంపి జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఆయన ఇదే అంశాన్ని ఎత్తి చూపారు. రాజ్యసభలో ఎయిమ్స్ ఖాళీలపై తాను అడిగిన ప్రశ్నకు సమాధానంగా దేశవ్యాప్తంగా ఏడు ఎయిమ్స్ సంస్థలకు సంబంధించిన ఖాళీల భర్తీ వివరాలను మంగళవారం కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఇచ్చిన గణాంకాలు కలవరపెడుతున్నాయని బుధవారం ఎక్స్ పోస్టులో జైరాం రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిమ్స్ న్యూఢిల్లీ, భోపాల్, భువనేశ్వర్, జోద్‌పూర్, రారుపూర్, పాట్నా, రిషికేశ్‌లలో ఫ్యాకల్టీ రేటు 24 శాతం నుండి 39 శాతం వరకు ఉన్నాయని రమేష్ చెప్పారు. రాజ్‌కోట్ ఎయిమ్స్‌లో 59.5 శాతం, బిలాస్‌పూర్‌లో 54 శాతం మేర ఖాళీల భర్తీ ఉంది. ప్రతిష్టాత్మక ఢిల్లీ ఎయిమ్స్‌లో కూడా ఖాళీలు ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని ఆయన అన్నారు. ఎయిమ్స్‌లో ఉన్న ఖాళీలు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించినదే కాదు అధ్యాపకుల నాణ్యతను కూడా ఎత్తిచూపుతుందని ఆయన విమర్శించారు. కాగా, ఎయిమ్స్‌లో భర్తీ చేయాల్సిన ఖాళీలపై జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ స్పందించింది. ఎయిమ్స్ సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆరోగ్య, సంక్షేమ మంత్రిత్వశాఖ వెల్లడించింది.


# తాపం తీర్చే అమృతభాండం

### సమీపిస్తున్నవేసవి
### కొబ్బరి బొండాల అమ్మకాలపై రైతులు, వ్యాపారుల భారీ ఆశలు
### ప్రస్తుతం రైతు ధర రూ.12
### కొబ్బరికాయ ధర రూ.15



అమలాపురం: మండు వేసవిలో దాహం తీర్చాలన్నా, వేడెక్కిన శరీరాన్ని చల్లబరచాలన్నా, అనారోగ్యం బారిన పడితే త్వరగా కోలుకోవాలన్నా వెంటనే గుర్తుకు వచ్చేది కొబ్బరి బొండాం. కొనుగోలుచేసేవారికే కాదు.. ఉత్పత్తి చేసే రైతులకు కూడా ఇది అమృత బాండమే. మార్కెట్ ఒడిదొడుకులతో సంబంధం లేకుండా ధరలు నిలకడగా ఉండటం, కాయ సేకరణ భారం లేకపోవడంతో కొబ్బరి రైతులు ఇదే తమకు మేలని భావిస్తుంటారు. వేసవి సమీపిస్తుండటంతో బొండాల ధరలపైన, ఎగుమతులపైన రైతులు భారీగా ఆశలు పెట్టుకుంటున్నారు. కొబ్బరి నీళ్లలో పోషకాలు, ఎలక్ట్రోలైట్‌లు అధికంగా ఉంటాయి. ఒక కొబ్బరి బొండాం ఒక సెలైన్‌తో సమానం. బొండాంలో దాదాపు 300 మిల్లీ గ్రాముల సోడియం ఉంటుంది. శరీరానికి రోజుకు సరిపడా సోడియంను ఇది అందిస్తుంది. దీనిలో పొటాషియం, కాల్షియం, పాస్పరస్ కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇది తక్షణం శక్తిని ఇస్తుంది. ఇటీవలి కాలంలో బొండాం తాగేవారి సంఖ్య పెరిగింది. దీంతో ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి కొబ్బరి బొండాల ఎగుమతులు పెరిగాయి. మన రాష్ట్రంతో పాటు పొరుగునే ఉన్న తెలంగాణలోని ప్రధాన పట్టణాలకు ఇక్కడి నుంచి కొబ్బరి బొండాలు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. కొబ్బరి బొండాలకు ఒకప్పుడు వేసవి మాత్రమే సీజన్‌గా ఉండేది. ఇప్పుడు ఏడాది పొడవునా ఎగుమతులు జరుగుతున్నాయి. ఏలూరు జిల్లాలో దెందులూరు, చింతలపూడి, జంగారెడ్డి గూడెం, తూర్పు గోదావరి జిల్లా పరిధిలో చాగల్లు, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, కాకినాడ జిల్లాలో ఏలేశ్వరం, తుని పరిసర ప్రాంతాల నుంచి బొండాల ఎగుమతి ఎక్కువగా జరుగుతుంది. ప్రస్తుతం రోజుకు 50 లారీలకు పైగా ఎగుమతి అవుతుండగా, వేసవి సీజన్‌లో రోజుకు 100 లారీల వరకు కొబ్బరి బొండాల ఎగుమతి జరుగుతుంది. ప్రస్తుతం రైతుల వద్ద ఒక్కో కొబ్బరి బొండాం ధర రూ. 12 పలుకుతోంది. కొబ్బరి కాయ ధర రూ. 14 నుంచి రూ. 15 పలుకుతోంది. దీని వల్ల బొండాం అమ్మకాలకన్నా రైతులు కాయపై దృష్టి పెట్టారు. సాధారణంగా కొబ్బరి కాయ కన్నా బొండాం ధర రూ.4 నుంచి రూ. 5 ఎక్కువ ఉంటుంది. మార్చి నుంచి కొబ్బరి బొండాలకు వేసవి సీజన్ మొదలవుతుంది. కొబ్బరి కాయకు ఇప్పుడున్న ధర మరికొద్దిరోజులు ఉంటే బొండాం ధర రూ.18 నుంచి రూ.20 వరకు చేరుతుంది. కాని దిగుబడి అధికంగా ఉండటం వల్ల బొండానికి ధర తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాయతో పోల్చుకుంటే బొండాం అమ్మకాలే రైతులకు లాభసాటిగా ఉంటాయి. బొండాం ఆరు నుంచి ఎనిమిది నెలలకు తయారవుతుంది. అదే కొబ్బరికాయ పక్వానికి రావడానికి సుమారు 12 నెలలు పడుతుంది. కాయతో పోల్చితే బొండాల వల్ల రైతులు త్వరితగతిన ఉత్పత్తి అందుకుంటారు. కొబ్బరి కాయ రైతులే సేకరించాలి. దింపు, పోగువేత, రాశులు పోయడం ఇలా కాయకు రెండు రూపాయల వరకు ఖర్చవుతుంది. అదే బొండాలను వ్యాపారులే సొంత ఖర్చులు పెట్టుకుని దింపించుకుంటారు. దీంతో రైతులకు సేకరణ ఖర్చు తగ్గుతుంది.


# ఆసక్తి రేపుతున్న అగ్నిపరీక్ష



దేశ రాజధాని ప్రాంతం ఎన్నికల సమరానికి సిద్ధమైంది. నేడు జరగనున్న ఢిల్లీ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఉత్కంఠ ఇంత చలిలోనూ వేడి పుట్టిస్తోంది. ఆప్, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోటీలో 70 స్థానాల్లోని 699 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 1.56 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ సమరమిది. సోమవారం సాయంత్రం గడువు ముగిసేవరకు హోరాహోరీగా సాగిన ప్రచారంలో పార్టీల పరస్పర నిందారోపణలు పతాక స్థాయికి చేరాయి. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి ఆతిశి తమ పాలన నమూనాను ఆదర్శంగా చూపితే, ఆ పాలనంతా అవినీతిమయమంటూ, అగ్రేసర కమలనాథులు మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాలు శాంతి భద్రతల సమస్యను సైతం లేవనెత్తారు. గత రెండు ఢిల్లీ ఎన్నికల్లో కనీసం ఖాతా అయినా తెరవలేకపోయిన కాంగ్రెస్ పక్షాన రాహుల్, ప్రియాంకలు మిగతా రెండు పార్టీలపై విమర్శలు గుప్పించారు. అధికారిక నివాసాలకు ఆప్ ప్రజాధన దుర్వినియోగం, యమునా నది నీటి నాణ్యత, ఓటర్ల జాబితాలో అవకతవకల ఆరోపణలు పతాకశీర్షికలకు ఎక్కితే, ప్రతి పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో వాగ్దానం చేసిన ఉచిత కానుకలు ప్రజాకర్షణకు పోటీలు పడ్డాయి. నేటి ఓటింగ్, శనివారం నాటి కౌంటింగ్‌లతో కానీ రానున్న రోజులకు కానున్న ఢిల్లీ సుల్తాన్ ఎవరో తేలనుంది. ఏకోన్ముఖంగా సాగిన గడచిన 2015, 2020 నాటి ఎన్నికలకు భిన్నంగా ఈసారి ఉత్కంఠభరిత పోరాటం సాగనుంది. ముచ్చటగా మూడోసారి ఆప్ విజయం నల్లేరుపై బండి నడక కాదని కేజ్రీవాల్‌కూ తెలుసు. అయితే, ప్రస్తుతం ఎక్సైజ్ పాలసీతో అనుచిత లబ్ధి కేసులో బెయిల్‌పై ఉన్న కేజ్రీ వాల్ ఇప్పటికీ కాషాయ పార్టీకి బలమైన ప్రత్యర్థే. చిత్రమేమిటంటే... ఓటర్లను కుదిపేస్తాయనుకున్న అనేక అంశాలు క్షేత్రస్థాయిలో ఏమంత ప్రభావం చూపడం లేదట. కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా పలువురు 'ఆప్' అగ్ర నేతల్ని జైలుకు పంపిన ఎక్సైజ్ కుంభకోణం కానీ, ప్రజాధన దుర్వినియోగంతో కేజ్రీవాల్ ఆర్భాటంగా 'శీష్ మహల్' కట్టుకున్నారన్న ఆరోపణలు కానీ ఓటరుల్ని పెద్దగా ఆకర్షించడం లేదని వార్త. కూటి కోసం, కూలీ కోసం దేశ రాజధానికి వచ్చి కష్టాలు పడుతున్న బడుగు వర్గాలు కాస్తంత ఊపిరి పీల్చుకొనేందుకు ఎంతో కొంత చేయడంలో ఆప్ సఫలమైంది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత మంచినీరు, ఉచిత ఆస్పత్రి %-% వైద్యం లాంటి ప్రభుత్వ సౌకర్యాలు అన్నీ అందరికీ సక్రమంగా అందకున్నా, ఎంతో కొంత లబ్ధి చేకూరడంతో ఆ వర్గాల్లో పార్టీ కొంత బలంగా ఉందని ఓ విశ్లేషణ. అదే సమయంలో 'ఇండియా' కూటమిలోని ఆప్, కాంగ్రెస్‌లు ఢిల్లీలో పరస్పరం అస్త్రాలు సంధించుకోవడం చిత్రమైన స్థితి. 2024 హరియాణా ఎన్నికల్లో తమ మధ్య పోరు చివరకు బీజేపీకి లాభించిన చేదు నిజం నుంచి ఈ భాగస్వామ్య పక్షాలు పాఠం నేర్చుకున్నట్టు లేదు. గతంలో ఏకధాటిగా 15 ఏళ్ళు ఢిల్లీని ఏలిన కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా ఉంది. పోగొట్టుకున్న ఇమేజ్‌ను కూడగట్టుకొనేందుకు హస్తం పార్టీ తంటాలు పడుతోంది కానీ, పరిస్థితి 'అప్ప ఆరాటమే కానీ... బావ బతికే మార్గం లేదు' అన్నట్టుంది. గమ్మత్తేమిటంటే, దశాబ్దిన్నర క్రితం కాంగ్రెస్‌పై కోపంతో మార్పు కోరిన మధ్యతరగతి జనాభా సైతం ప్రస్తుతం ఆప్ ఉచిత హామీలు, అంతంత మాత్రపు అభివృద్ధితో కినిసినప్పటికీ మళ్ళీ మార్పు కావాలనీ, మళ్ళీ కాంగ్రెస్ రావాలనీ కోరుకోవట్లేదు. వెరసి, పోటీ అంతా బలమైన ఆప్‌కీ, బీజేపీకీ మధ్యనే! హరియాణాలోని బీజేపీ సర్కార్ ఢిల్లీకి వచ్చే యమునా జలాల్ని విషతుల్యం చేస్తోందన్న కేజ్రీవాల్ బాధ్యతారహిత ఆరోపణ ఎన్నికల సంఘం (ఈసీ) తాఖీదుకు దారి తీసినా, వివరణతో ఆయన దాన్ని అధిగమించారు. బీజేపీని ఆత్మరక్షణ ధోరణిలో పడేసి, ఆరోపణలకు జవాబివ్వడంలోనే ఆ పార్టీకి పుణ్యకాలం గడిచిపోయేలా చేశారు. స్థానిక ఢిల్లీ పీఠంపై ఆప్ 11 ఏళ్ళు గడపడంతో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత సహజం. అదే సమయంలో కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టినప్పటికీ, 27 ఏళ్ళుగా ఢిల్లీ అసెంబ్లీపై జెండా ఎగరేయలేకపోయిన బీజేపీ ఈసారి చరిత్ర తిరగరాయాలని బలంగా సంకల్పించింది. దిగువ శ్రేణి జనం ఆప్‌కు అండగా నిలబడితే, ఆదాయపు నిచ్చెనలో పైకి పోయినకొద్దీ అవకాశాలను అందుకుంటున్న ప్రజానీకం మాత్రం మోదీ మార్కు బీజేపీ అభివృద్ధి మాటల వైపు మొగ్గుతున్నారు. ఈ సంకుల సమరంలో బీజేపీ సైతం ఓటర్ల కోసం ఉచితాల బాట తొక్కక తప్పలేదు. పనిలోపనిగా ఇంతకాలంగా భారం మోస్తున్న మధ్య తరగతి వర్గానికి తాజా కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను నుంచి భారీ ఊరట అందించింది. ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో ఢిల్లీకి ప్రత్యేకించే ఏదీ చేయరాదంటూ నెల క్రితం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) హూంకరించినా, జరిగింది వేరు. పన్ను మినహాయింపు 'ఢిల్లీకి మోదీ సర్కార్ కానుక' అంటూ పత్రికల్లో మొదటి పేజీలో బీజేపీ భారీ ప్రకటనలు గుప్పించినా ఈసీ కిమ్మనలేదు. గత పదేళ్ళలో అధికారాలతో బలోపేతుడైన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కానీ, ఓటర్ల జాబితాల్లో గోల్‌మాల్ ఆరోపణలు సహా అనేక అంశాల్లో ఇప్పుడు ఈసీ కానీ నిష్పక్షపాతంగా ఉన్నట్టు నమ్మించలేకపోయారు. ఈ నెలలోనే రిటైర్ కానున్న సీఈసీపై ఆప్ ఆరోపణల నేపథ్యంలో ఈసీ వివరణనిచ్చుకోవాల్సి వచ్చిన దుఃస్థితి. ఆరోపణలు, అనుమా నాల నేపథ్యంలో 'ఢిల్లీలో కేజ్రీవాల్... కేంద్రంలో మోదీ' అన్న మాట మారిపోయే అవకాశమూ లేక పోలేదు. అందువల్లే, ఈసారి ఢిల్లీ ఎన్నికలు ఆప్‌కు అగ్నిపరీక్షయ్యాయి. ఈ ఏటి బిహార్ ఎన్నికలపై, వచ్చే ఏటి బెంగాల్ ఎన్నికలపైనా ఈ ఫలితాల ప్రభావం తథ్యం గనక ఆసక్తి రేపుతున్నాయి.

# కేంద్ర పద్దుపై పోరు





ఏదైనా ఒక పని మంచిదా? కాదా? అని బేరీజు వేయాల్సి వచ్చినప్పుడు అది అత్యధిక మందికి మేలు చేస్తే మంచిదని చెబుతుంటారు పెద్దలు. ఆ రకంగా చూస్తే 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర విత్తమంత్రి నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్ మనదేశంలో అసంఖ్యాకంగా ఉన్న కార్మికులు, కష్టజీవులు, కర్షకులు, పేదలకు ఉపయోగపడేదిగా లేదని పెదవి విరుస్తున్నారు ఆర్థిక విశ్లేషకులు. పద్దులోని కేటాయింపులను బట్టి ఇది ఫక్తు ఎన్నికలు జరగబోయే ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్‌కు, బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఉపయోగకరంగా ఉందే తప్ప మొత్తం దేశానికి, తెలంగాణకు ఎంతమాత్రమూ ప్రయోజనకరంగా లేదన్నది నిర్వివాదాంశం. అంకెల గారడీ, కాకిలెక్కలు అని సాధారణంగా విమర్శలు చేయకుండా లోతుగా పరిశీలిస్తే ఈ బడ్జెట్ ఎవరికోసమనేది తేలుతుంది. జాతీయ స్థూల ఉత్పత్తి(జీడీపీ)ని పెంచాలన్న సదుద్దేశంలో పన్ను మినహాయింపు లిచ్చామంటూ మంత్రి సూత్రీకరించారు. కానీ జీడీపీ పెరగాలంటే పన్ను మినహాయింపు లివ్వటం కాదు.. దేశంలో అట్టడుగునున్న కార్మికుల కనీస వేతన స్థాయి పెరగాలి, అసంఘటిత రంగ కార్మికుల వేతనాలు, వృత్తిదారులు, రైతుల ఆదాయాలు పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్న మౌలిక సూత్రాన్ని కేంద్రం విస్మరించటం దాని ఆర్థిక విధానాలకు నిదర్శనం. ఈ సూత్రానికి విరుద్ధంగా కార్పొరేట్, ప్రయివేటు పెట్టు బడులను ఇంకా ప్రోత్సహించటం ద్వారా సంపన్నులు మరింత సంపన్నులుగా, శతకోటీశ్వరులు మరింత శత కోటీశ్వరులుగా మారేందుకు సర్కారు ఊతమిస్తోంది. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తూ అంతో ఇంతో వారి పొట్ట నింపుతున్న 'నరేగా'కు ఎక్కువ నిధులు కేటాయించాలన్న డిమాండ్లను పట్టించుకోకుండా కేవలం రూ.86 వేల కోట్లే ఇచ్చి చేతులు దులుపుకోవటం పేదల పట్ల మోడీ సర్కార్‌కు ఉన్న చిత్తశుద్ధికి ప్రత్యక్ష ఉదాహరణ. దేశ స్వయం సమృద్ధిలో ఇప్పటి వరకూ కీలక పాత్ర పోషించిన ఇన్సూరెన్స్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నూటికి నూరు శాతం ఆహ్వానించటం ద్వారా ఆ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్‌కు ధారాదత్తం చేశారు. ఆర్థిక మాంద్యం గురించి సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో దాన్నుంచి గట్టెక్కేందుకు తీసుకోవా ల్సిన విధానపరమైన నిర్ణయాలను ఆర్థిక మంత్రి విస్మరించారు. అడ్డూఅదుపు లేకుండా పెరుగు తున్న ధరలను నియంత్రించేందుకు కేంద్రం నిర్దిష్ట చర్యలను ప్రకటించకపోవటంతో పేదలు, మధ్యతరగతిపై మరిన్ని భారాలు పడనున్నాయి. ఇక మన రాష్ట్రానికి ఈ బడ్జెట్‌ను అన్వయించి చూసుకుంటే ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు దక్కింది గుండుసున్నా. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల కోసం రూ. 1.63 లక్షల కోట్ల సాయం చేయాలంటూ రేవంత్ సర్కారు కేంద్రాన్ని కోరుతూ వస్తోంది. వాటిలో చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా వెక్కిరించటం 'బడేభారు'కే చెల్లింది. వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాలకు ఇచ్చే నిధులను ఆరేండ్ల నుంచి తొక్కిపట్టిన కేంద్రం ఈసారి కూడా వాటికి కేటాయింపులు చేయకుండా 'సారీ' చెప్పింది. తన ప్రసంగాల్లో ప్రతీసారి 'మిత్రోన్ అంటూ సంబోధించే ప్రధాని మోడీ, తెలంగాణను మాత్రం తన మిత్రుల జాబితాలో చేర్చుకోలేదు. అందుకే కాబోలు పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్ల సాయం ప్రకటించి, తెలంగాణకు 'గాడిద గుడ్డు'ను ఇచ్చారు. తెలంగాణ కంటే ముందు ఏర్పడిన రాష్ట్రాలను పరిశీలిస్తే వాటికి సంబంధించిన ఏ ఒక్క విభజన హామీలను నెరవేర్చలేదంటూ సీపీఐ(ఎం) ఏనాడో హెచ్చరించింది. అదే కత ఇప్పుడు మన రాష్ట్రం విషయంలో నిజమైంది. విభజన హామీల్లో ఏ ఒక్కదాన్నీ అమలు చేయని కేంద్రం ఇప్పుడు వాటిని పూర్తిగా అటకెక్కించింది. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదాపై బడ్జెట్‌లో ఒక్కటంటే ఒక్క ముక్క లేకపోవటం గమనార్హం. కాకపోతే ఈ పద్దులో మోడీ సర్కార్ అన్ని రాష్ట్రాలతోపాటు తెలంగాణకు కూడా 'ఓ బంపర్ ఆఫర్' ఇచ్చింది. విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తే ఎఫ్ఆర్‌బీఎమ్ చట్టం కింద మరో 0.5 శాతం అప్పులిస్తామంటూ రాష్ట్రాలకు ఆశపెట్టారు. ఈ ఆశకు మనం అర్రులు చాస్తే గతంలో వినిపించిన 'మోటార్లకు మీటర్లు' అనే పదాన్ని మళ్లీ వినాల్సి వస్తుంది. అదే జరిగితే తెలంగాణ వ్యవసాయం కుదేలవుతుంది. తన రాజకీయ ప్రయోజనాలరీత్యా అయినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాంటి విద్యుత్ సంస్కరణలను అమలు చేయబోమని ప్రకటించింది. అందువల్ల అత్యంత ప్రమాదకరమైన కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను నేటి కాంగ్రెస్ సర్కారు సైతం నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. రాష్ట్రానికి ఎలాంటి మేలు చేయని కేంద్ర బడ్జెట్‌పై సీపీఐ(ఎం) ఇప్పటికే నిరసనలు చేపట్టింది. అధికార కాంగ్రెస్ గళమెత్తి, ఆందోళనలకు పిలుపునివ్వటం హర్షణీయం. అయితే ఇక్కడితో ఆగిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం తన పోరాటాన్ని హస్తిన దాకా కొనసాగించాలి. అన్ని పార్టీలనూ కలుపుకుని ఢిల్లీని 'ఢ' కొట్టాలి.

## ప్రజాస్వామ్య నేరానికి పాల్పడిన పోలీసులు



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో మిల్కిపూర్ నియోజకవర్గంలో నేడు ఉప ఎన్నిక జరుగుతుంది. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల వెలుపలే పోలీసు సిబ్బంది ఓటరు గుర్తింపు కార్డులను తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీలపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఎంపి అఖిలేష్ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ వెలుపల పోలీసు అధికారి ఓటరు కార్డును తనిఖీ చేస్తున్న ఓ ఫోటోను అఖిలేష్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే అఖిలేష్ ఆరోపణల్ని అయోధ్య సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) రాజ్ కరణ్ నయ్యర్ ఖండించారు. ఓటరు ఐడి కార్డులను తనిఖీ చేస్తున్న వ్యక్తి పోలింగ్ ఏజెంట్ అని, పోలీసు సిబ్బంది కాదు అని అన్నారు. అయితే అయోధ్య ఎస్ఎస్‌పి రాజ్ కరణ్ వ్యాఖ్యలను అఖిలేష్ యాదవ్ తోసిపుచ్చారు. మిల్కిపూర్ నియోజకవర్గం అయోధ్య జిల్లాలోనిదే. ఈరోజు పోలింగ్ జరుగుతున్నందున అయోధ్య పోలీసులే పోలింగ్ బూత్ వెలుపల ఓటర్ ఐడి కార్డులను తనిఖీ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో సీనియర్ పోలీసుల అధికారుల ప్రమేయం కూడా ఉందని అఖిలేష్ అన్నారు. పోలీసుల తనిఖీలకు సంబంధించిన వార్తలను, చిత్రాలను ఎన్నికల సంఘం వెంటనే గుర్తించాలని అఖిలేష్ పేర్కొన్నారు. ఓటర్లలో భయాందోళనలు సృష్టించి ఓటింగ్‌ను పరోక్షంగా ప్రభావితం చేయడం ప్రజాస్వామ్య నేరమని అఖిలేష్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన పోలీసు అధికారులను, సిబ్బందిని విధుల నుంచి తొలగించాలని ఆయన ఎన్నికల సంఘాన్ని కోరారు.


## అమెరికా యుద్ధ విమానంలో అమృత్‌సర్‌కు 205మంది వలసదారులు



అమృత్‌సర్ : చరిత్రలో తొలిసారిగా మిలిటరీ విమానాల్లో అక్రమ వలసదారులను స్వదేశాలకు తరలించే ప్రక్రియ ప్రారంభమయ్యింది. శాన్ ఆంటోనియో నుండి అమెరికా సీ 17 యుద్ధ విమానంలో బయలుదేరిన 205 మంది వలసదారులు బుధవారం మధ్యాహ్నం అమృత్‌సర్‌కు చేరుకున్నారు. తొలి దశలో 20 వేలమంది భారతీయులను తరలించేందుకు అమెరికా సిద్ధమైంది. ఈ మొదటి విమానం అమృతసర్‌లోనే ల్యాండ్ అవ్వడానికి కారణమేమిటంటే %ా% ఆ దేశంలో అక్రమంగా వలస ఉంటున్నవారిలో అగ్రస్థానం పంజాబీలు కాగా, రెండో స్థానంలో గుజరాతీలున్నారు. వీళ్ళంతా వేర్వేరు సమయాల్లో డంకీ రూట్‌లో అక్కడికి వలసవెళ్లినవారు. డంకీ అంటే అక్రమంగా చొరబడటం. అక్రమ వలసదారులపై నిఘా పెట్టిన అమెరికా ఖర్చుకు వెనుకాడటం లేదు. ఎన్నడూ లేనంత ఖర్చు పెట్టి వలసదారులను ఆయా దేశాలకు యుద్ధ విమానాల్లో తరలింపును ప్రారంభించింది. అమెరికా నుంచి ఇండియాకు తరలించేందుకు ఒక్కొక్కరిపై 4 వేల 675 డాలర్లు అంటే 4 లక్షల 6 వేల రూపాయలు ఖర్చు చేస్తోంది. తొలి దశలో వచ్చిన 205 మందిపై అప్పుడే 8 కోట్ల 33 లక్షల రూపాయలు వెచ్చించింది. మొత్తం 7.25 లక్షల మందిని తరలించేందుకు వేల కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమైంది.


## రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నగదు జమ






హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం బుధవారం రైతు భరోసా నిధులను విడుదల చేసింది. మండలాల్లో గ్రామాల వారీగా నగదు జమ జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఒక ఎకరం వరకు సాగులో ఉన్న భూములకు లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేసింది. మొత్తంగా 17.03 లక్షల రైతుల అకౌంట్లకు ఇవాళ రైతుభరోసా నిధులు జమ కానున్నట్లు సమాచారం. నాలుగు పథకాల అమలులో భాగంగా.. గణతంత్ర దినోత్సవంనాడు రైతు భరోసా నిధులను విడుదల చేసింది. అయితే ఆరోజు సెలవు రోజు కావడంతో.. ఆ మరుసటిరోజు రాష్ట్ర ప్రభుత్వం 32 జిల్లాల్లోని 563 గ్రామాల్లో 4,41,911 మంది రైతులకు ఒక్కో ఎకరానికి తొలి విడతగా రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. ఆయా గ్రామాల్లో 9,48,333 ఎకరాల విస్తీర్ణంలోని సాగుభూమికి రూ.569 కోట్లను చెల్లించింది. ఇక భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థికసాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి శ్రీకారం చుట్టింది. మొదటి రోజున 18,180 కుటుంబాలకు మొదటి విడతగా రూ.6 వేల నగదును వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకానికి తొలి రోజున ఆర్థికశాఖ రూ.10.91 కోట్లు విడుదల చేసింది. రైతు భరోసా నగదు జమ ఆలస్యం అవుతుండడంతో.. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు చేస్తోంది.

## అమెరికా విమానంలో.. ఆ రాష్ట్రాల వారే ఎక్కువ..!



అమృత్‌సర్:అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యల్లో భాగంగా అమెరికా పంపించిన ప్రత్యేక విమానంలో భారత్‌కు తిరిగి వచ్చిన వలసదారుల్లో ఎవరెవరున్నారన్న విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బుధవారం(ఫిబ్రవరి5) మధ్యాహ్నం 1.45గంటలకు అమృత్‌సర్‌లోని గురురామ్‌దాస్‌జీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో వలసదారులతో వచ్చిన అమెరికా విమానం ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. విమానంలో మొత్తం 205 మంది భారతీయలను అమెరికా నుంచి పంపించి వేశారని ప్రచారం జరిగింది. అయితే విమానంలో 104 మంది మంది భారతీయులే ఉన్నారు. 45 మంది దాకా అమెరికా అధికారులు కాగా, 11 మంది విమాన సిబ్బంది ఉన్నారు. అయితే 104మంది భారతీయుల్లో మొదటి స్థానంలో గుజరాత్,హర్యానాకు చెందిన వారు ఎక్కువగా ఉండగా తర్వాతి స్థానంలో పంజాబ్‌కు చెందిన వారు ఉన్నారు. విమానంలో వచ్చిన వారిలో 4 ఏళ్ల వయసున్న చిన్నారి కూడా ఉండడం గమనార్హం. అమెరికా నుంచి అందరు భారతీయులకు స్వాగతం పలికామని, మన దేశానికి చెందిన వారిని ఇలా పంపించి వేయడం దురదృష్టకరమని పంజాబ్ డీజీపీ వ్యాఖ్యానించారు. అమెరికాలో భారత అక్రమ వలసదారుల ఏడున్నర లక్షల మంది దాకా ఉన్నట్లు ప్యూ రీసెర్చ్ సెంటర్ అంచనా. ఈ లెక్కన మెక్సికో, ఎల్ సాల్వడోర్ తర్వాత అత్యధికంగా అలా ఉంటోంది భారతీయులే. వీళ్లందరినీ వెనక్కి పంపించే ప్రక్రియ కొనసాగుతుందని అక్కడి అధికారులు అంటున్నారు. ఈ క్రమంలో సుమారు 18 వేల మంది భారతీయులతో కూడిన జాబితాను అక్కడి ఇమ్మిగ్రేషన్ - కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలో భారత ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించనున్నారు. ఆ సమయంలో ట్రంప్‌తో ఆయన ఈ అంశంపైనా చర్చించే అవకాశాలున్నాయి

# విద్యకు ప్రాధాన్యతేది




'దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుంది' అని పెద్దలంటారు. కానీ పాలకులకు దీని అభివృద్ధి పట్టదు. నాణ్యమైన విద్యను అందిస్తామని హామీనిచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ మాటను ఎప్పుడో మర్చిపోయింది. బడ్జెట్‌లో విద్యకు చేస్తున్న కేటాయింపులు ప్రపంచ దేశాలతో పోల్చితే చాలా తక్కువ. సోషలిస్టు క్యూబాతోనే కాదు అనేక పశ్చిమ, యూరోపియన్ దేశాలు, ఇతర అభివృద్ధి చెందుతున్న బ్రెజిల్, దక్షిణాఫ్రికా, కెన్యా లాంటి దేశాల కంటే చాలా తక్కువ కేటాయింపులు జరుగుతున్నాయి. విద్యారంగం మీద ప్రాధాన్యం మేరకు ఖర్చు చేస్తున్న దేశాలు అభివృద్ధి సాధిస్తున్నాయి. ఈ విషయంలో ఎంతోమంది అనేక రకాల సూచనలు చేసినా, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలూ నివేదికల రూపంలో అందించినా అవి బుట్టదాఖలే. యూపీఏ హయాంలో విద్యారంగం నాశనమైందని, తాము వస్తే నాణ్యమైన విద్యనందించే విధంగా బడ్జెట్లో అత్యధిక నిధులు కేటాయి స్తామని బీజేపీ చెప్పింది. కానీ 2013- 14 నుంచి 2024-25 వరకు విద్యకు కేటాయిం చిన నిధులు నామమాత్రమే. తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్లోనూ అదే పరిస్థితి. "ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్" పేరుతో వేద విద్యకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడమంటే విద్యలోకి మతాన్ని జొప్పించడమే. బీజేపీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది 2013-14 బడ్జెట్‌లో 3.16 శాతం నిధులను విద్యకు కేటాయించగా, 2024-25లో అది 1.53 శాతానికి తగ్గిపోయింది. ఉన్నతవిద్యకు కేటాయింపులు 2013-14లో 1.6 శాతం ఉండగా 2024-25లో ఒక శాతానికి పడిపోయాయి. 2025-26 బడ్జెట్‌లో 2.53 శాతం నిధులను మాత్రమే విద్యకు కేటాయించారు. అందులో పాఠశాల విద్యకు 1.5 శాతం, ఉన్నత విద్యకు 0.98 శాతం నిధులు దక్కాయి. ఈ మాత్రం నిధులతో దేశంలోని లక్షా 50వేల ఉన్నత పాఠశాలల్లోని పదివేల బడుల్లో అటల్ టింకరింగ్ ప్రయోగశాలలను అభివృద్ధి చేస్తామని, వచ్చే నాలుగేండ్లలో నలభైవేల పాఠశాలలకు విస్తరిస్తామని ప్రతిపాదించారు. పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని, రూ.500 కోట్లతో ఏఐ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఆర్థికమంత్రి సెలవిచ్చారు. గతం కంటే ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకున్నా ఆ తర్వాత సవరించిన అంచనాల్లో తగ్గడం గ్యారంటీ. గతేడాది సీఎం పోషణ కింద ( మధ్యాహ్న భోజనం పథకం కోసం) రూ.12 వేల కోట్లు కేటాయింపులు జరిగినా సవరించిన అంచనాల్లో పది వేల కోట్లు వరకు పరిమితమైంది. ప్రయోగశాలల అభివృద్ధిలోనూ మార్పులేదు. ఉన్నత విద్యను మెరుగుపరిచేందుకు భారీగా నిధులు అవసరం. అయితే, ఆ మేరకు నిధుల కేటాయింపు జరగడం లేదు. కానీ ప్రస్తుత బడ్జెట్‌లో ఈ అంశం పట్టించుకోలేదు. ప్రభుత్వ విశ్వవిద్యా లయాలు, ఐఐటీలు, నిట్‌లు, ఇతర కేంద్ర-రాష్ట్ర విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యనందించడంలో కష్టాలను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ 200 విశ్వవిద్యాలయాల్లో భారతీయ యూనివర్సిటీలు మూడు మాత్రమే ఉన్నాయి. దీనకంతటికీ సరైన నిధుల కేటాయింపులేకపోవడమే. నిధుల కేటాయింపు లేకుండా భారతీయ సంస్థలు అంతర్జాతీయంగా పోటీపడలేని పరిస్థితి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కూడా బడ్జెట్ ప్రాధాన్యం ఇవ్వలేదు. పరిశోధనారంగాన్ని ఈ పదేండ్లలో నిర్లక్ష్యం చేశారు. దేశ అభివృద్ధికి ఉపయోగపడే ఒక్క పరిశోధన కూడా జరగలేదు. ఉపాధిని పెంపొందించడానికి బలమైన వృత్తి శిక్షణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల కోసం సిఫారసులు చేసినప్పటికీ ఆ దృష్టి లేకుండా పోయింది. ఇటీవలి కాలంలో ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాముఖ్యత తగ్గించి, ప్రయివేట్ రంగాన్ని ప్రోత్సహించే విధంగా నిర్ణయాలు తీసుకున్నారు. విద్యాసంస్థలు ఆర్థికంగా స్వయం పోషితమవ్వాలనే పేరుతో వాటి ఫీజులను పెంచడం, కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రాధాన్యతనివ్వడం, ప్రభుత్వ సహాయాన్ని తగ్గించడం, ఉపాధ్యాయ నియామకాలను తగ్గించడం వంటివి ప్రభుత్వ విధానాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. నూతన జాతీయ విద్యావిధానంలో పేదలకు ఉన్నత విద్య నిరాకరించబడుతోంది. ఈ ప్రయివేటీకరణ ధోరణితో సామాన్యులకు ఉన్నత విద్య మరింత ఖరీదైనదిగా మారుతోంది. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండగా, ప్రభుత్వం బడ్జెట్లో అతి తక్కువ నిధులు కేటాయిస్తూ మౌలిక సౌకర్యాల విషయంలో శ్రద్ధ వహించడం లేదు. ఇది ప్రయివేటు విద్యాలయాల వైపు విద్యార్థులను ప్రోత్సహించ డంలో భాగమే. వాస్తవానికి కొఠారి కమిషన్ ఆరుశాతం స్థూల జాతీయ ఆదాయాన్ని విద్యారంగానికి కేటాయించాలని సూచించింది. ఆ రకంగా విద్యా బడ్జెట్‌ను పెంచి, సామాన్యులకు నాణ్యమైన విద్యనందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యావ్యవస్థ అభివృద్ధి చెందాలంటే, ప్రజలు, విద్యార్థులు, విద్యావేత్తలు అందరూ కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

# ప్రజారోగ్యంపై కాలుష్యం కాటు



'లాన్సెట్' ప్లానెటరీ హెల్త్ జర్నల్‌లో ఇటీవల ప్రచురించిన అధ్యయనంలో 'కాలుష్యం' ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి తక్షణ గండంగా మారిందని వెల్లడించింది. కాలుష్యం వల్ల 2019లో 9 మిలియన్లమంది చనిపోవడానికి కారణమైందని ఈ నివేదిక పేర్కొంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఆరుగురిలో ఒకరి మరణానికి కారణమని చెప్పవచ్చు. గాలికాలుష్యం అత్యంత ప్రాణాంతక రూపంగా 6.7 మిలియన్ల మరణాలకు కారణమైంది. ఆ తరువాత నీటికాలుష్యం కూడా విషపూరిత రసాయనాల వల్ల కలిగే ప్రాణనష్టం ఎక్కువగా ఉంది. ఈ కాలుష్యంతో మృతిచెందిన వారిలో అధిక శాతం మధ్య-తక్కువ ఆదాయ దేశాల్లో ఉన్నారు. భారతదేశం, దక్షిణా ఆసియాలో ఈ సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా కాలుష్యం కారణంగా సంభవించే మరణాలలో ముఖ్యంగా 2.4 మిలియన్ల వరకు భారతదేశంలోనే చోటుచేసుకున్నాయి. గృహ గాలి కాలుష్యం, తాగడానికి అనుకూలంగా లేని నీటికొరత, తగిన శుభ్రతాలోపం ప్రధాన కారణాలుగా గుర్తించబడ్డాయి. దేశరాజధాని ఢిల్లీ ప్రపంచం లో అత్యంత కాలుష్యగ్రస్త నగరాల్లో ఒకటిగా నిలిచింది. 2022లో 'ఐక్యూఎయిర్' నివేదిక ప్రకారం 100 అత్యంత కాలుష్యగ్రస్త నగరాల్లో 63 నగరాలు భారతదేశంలోనే ఉన్నా యి. భారతదేశంలో 'యునిసెఫ్', 'ప్యూర్ ఎర్త్' నివేదిక ప్రకారం 275 మిలియన్లకు పైగా చిన్నారులు రక్తంలో అధిక లీడ్‌స్థాయిలకు గురయ్యే ప్రమాదంలో ఉన్నారు. కాలుష్యం కారణంగా భారత ఆర్థిక వ్యవస్థపై భారీ ప్రభావం పడుతోంది. లాన్సెట్ నివేదిక ప్రకారం, పపంచవ్యాప్తంగా కాలుష్యం-సంబంధిత వ్యాధుల వల్ల 4.6 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం సంభవిస్తోంది. ఇది ప్రపంచ జిడిపి 6.2 శాతం. భారతదేశం కేవలం గాలి కాలుష్యంవల్లే సంవత్సరానికి 150 బిలియన్ డాలర్లకుపైగా ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నదని 'అంతర్జాతీయ సుస్థిర అభివృద్ధి సంస్థ' నివేదిక పేర్కొంది. మన దేశం కాలుష్యాన్ని తగ్గించేందుకు కొన్ని చర్యలను ప్రారంభించింది. 'నేషనల్ క్లీన్‌ఎయిర్ ప్రోగ్రామ్' ద్వారా 2024 నాటికి పార్టిక్యులేట్ మ్యాటర్ సాంద్రతలను 20-30 శాతం వరకు తగ్గించే లక్ష్యంతో చర్యలు చేపట్టారు. 'స్వచ్ఛ భారత్ మిషన్' శానిటేషన్ కవరేజీలో కొంతమేరకు ప్రగతిని సాధించగలిగింది. అయినప్పటికీ ఇప్పటికీ బొగ్గుఆధారిత విద్యుత్ కేంద్రాలు భారత గాలి కాలుష్యంలో 60% పైగా వాటాను కలిగి ఉన్నందున దీని ప్రభావం ఇంకా తీవ్రంగా ఉంది. ప్రత్యేకించి పంజాబ్, హర్యానా వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పత్తుల్లో వ్యర్థాలు కాలుష్యాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. పట్టణాలు, మహానగరాల్లో గాలి కాలుష్యానికి 40 శాతం కారణం అయిన ట్రాన్స్‌పోర్ట్ రంగం కూడా సమర్థవంతమైన సంస్కరణలను అవసరపడుతోంది. కాలుష్యాన్ని తగ్గించడానికి సమన్వయ పూర్వక చర్యలు అవసరం. శక్తివంతమైన పర్యావరణ నియంత్రణ, శుభ్రమైన శక్తిమార్పిడి, అలాగే నిలకడైన మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు అత్యవసరం. బొగ్గును తగ్గించడంలో, పునరుత్పాదక శక్తి ప్రాజెక్టులను విస్తరించడం, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడంలో భారత్ కీలకమైన చర్యలను తీసుకోవాలి. అదనంగా కాలుష్య ప్రభావంపై ప్రజలలో అవగాహన పెంచడం మరీ అవసరం . కాలుష్యం అనేది ఒక్క పర్యావరణ సమస్య మాత్రమే కాదు, ఇది ప్రజారోగ్యాన్ని, అలాగే ఆర్థిక సంక్షోభానికి మూలం కూడా. దీని ప్రభావం తీవ్రతను అధిగమించాలంటే తక్షణ చర్య అవసరం. భారతదేశానికి ఈ సమస్యను ఎదుర్కొనేందుకు సవాళ్లు ఉన్నప్పటికీ, వాటిని పరిష్కరించగల అవకాశాలు కూడా ఉన్నాయి. సమష్టి ప్రయత్నాలతో భారతదేశం కాలుష్యాన్ని తగ్గించడంలోనూ ప్రజలకోసం ఒక శుభ్రమైన, ఆహ్లాదకమైన భవిష్యత్తును నిర్ధారించడంలో ఆదర్శంగా నిలువగలదు.

# కార్చిచ్చుల సీజన్.. అంతటా టెన్షన్



లాస్‌ఏంజెలెస్‌లో గత కొన్ని వారాలపాటు కార్చిచ్చు చెలరేగి ఇళ్లు, తోటలు, పంటలు సర్వం బూడిద కుప్పలుగా మిగిలిపోయిన సంగతి తెలిసిందే. ప్రపంచ దేశాలన్నీ ఈ వైపరీత్యానికి ఉలిక్కిపడుతున్న తరుణంలో జమ్మూకశ్మీర్ ప్రాంతంలో కార్చిచ్చు ప్రమాదం ముంచుకువస్తోందని అధికారులు హెచ్చరించడం గమనార్హం. ఉత్తరాఖండ్‌లోని అల్మోరా అడవిలో కూడా ఈ నెల మొదట్లో కిలోమీటరు పొడవునా మంటలు వ్యాపించి అడవులను దహించి వేశాయి. ఉత్తరాఖండ్‌లో సాధారణంగా ఫిబ్రవరి 15 నుంచి అగ్నిప్రమాదాల సీజన్ ప్రారంభమవుతుంది. కానీ ఈ ఏడాది జనవరిలోనే అగ్నిప్రమాదాల సీజన్ ప్రారంభం కావడం గమనార్హం. ఉత్తరాఖండ్ ప్రభుత్వం కార్చిచ్చును నివారించడానికి ప్రతి ఇంటిని అప్రమత్తం చేయడానికి 5000 మంది వాలంటీర్లను నియమించింది. ఇదిలా ఉండగా అడవుల్లో కార్చిచ్చు వ్యాపించకుండా రెండు అటవీ విభాగాల మధ్య ఫైర్‌లైన్ (అగ్నిరేఖ) లను గీసే విధానం బ్రిటిష్ కాలంలో ప్రారంభమైంది. అంటే రెండు అటవీ డివిజన్ల మధ్య 100 అడుగుల ఫైర్‌లైన్, రేంజ్‌ల మధ్య 50 అడుగుల ఫైర్‌లైన్ నిర్వహిస్తుంటారు. ఈ ఫైర్‌లైన్లలో పెరిగిన చెట్లను చివరిసారిగా 1996లో తొలగించారు. ఇప్పుడు 28 సంవత్సరాల తరువాత మళ్లీ తొలగించడం ప్రారంభించారు. ఈ ఫైర్‌లైన్‌లో పెరిగిన దాదాపు 5 లక్షల చెట్లను నిర్మూలిస్తారు. దీనివల్ల కొంత వరకైనా కార్చిచ్చు ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరం కార్చిచ్చులకు 12 మంది ప్రాణాలు కోల్పోగా, 1270 వరకు కార్చిచ్చులు సంభవించాయి. ఈమేరకు గత ఐదు ఫైర్ సీజన్లలో భారతదేశం లో 11,09,588 కార్చిచ్చులు సంభవించాయని డేటా చెబుతోంది. పర్యావరణ వ్యవస్థకు, వన్యప్రాణులకు, ప్రజల జీవితాలకు ముప్పుగా కార్చిచ్చులు వ్యాపిస్తుంటాయి. గత అయిదు ఫారెస్ట్ ఫైర్ సీజన్లలో ఒడిశా, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో ఏటా లక్షకు పైగా కార్చిచ్చు ప్రమాదాలు సంభవించాయని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ రాజ్యసభలో వెల్లడించింది. ఈ నాలుగు రాష్ట్రాల్లో మొత్తం 4,73,834 కార్చిచ్చుల ప్రమాదాలు సంభవించాయి. దేశంలోని మొత్తం కార్చిచ్చు ప్రమాదాల్లో పై నాలుగు రాష్ట్రాల ప్రమాదాలు దాదాపు 43 శాతం వరకు ఉంటున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 81,003 కార్చిచ్చులు జరగ్గా, దేశం మొత్తం మీద కార్చిచ్చుల్లో 50 శాతం కార్చిచ్చులు గత ఐదు సీజన్లలో ఈ ఐదు రాష్ట్రాల్లో జరిగాయని తేలింది. ఇవే కాకుండా తెలంగాణ, ఉత్తరాఖండ్, జార?ండ్ రాష్ట్రాల్లో 50,000 కన్నా ఎక్కువ కార్చిచ్చు ప్రమాదాలు జరిగాయని రికార్డు అయ్యాయి. ప్రస్తుత సమీక్ష ప్రకారం దేశంల్లో మొత్తం అడవులు, చెట్లు 8,27,357 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్నాయి. అంటే దేశంలో 25.17% భౌగోళిక ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. మొత్తం మడ అడవులు 4992 చదరపు కిలోమీటర్ల పరిధిలో వ్యాపించాయి. భారీ ఎత్తున అడవులు విస్తరించిన రాష్ట్రాల్లో టాప్ మూడింటిలో మధ్యప్రదేశ్ (77,073 చదరపు కిలోమీటర్లు), అరుణాచల్‌ప్రదేశ్ (65,882 చదరపు కిలోమీటర్లు), చత్తీస్‌గఢ్ (55,812 చదరపు కిలోమీటర్లు) ఉన్నాయి. ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్టు (ఐఎస్ఎఫ్ఆర్) 2021 ప్రకారం దేశంలోని అడవుల్లో 36 శాతం తరచుగా కార్చిచ్చు ప్రమాదాలు జరగడానికి అనువుగా ఉన్నాయని వెల్లడైంది. ఇందులో 2.81% తీవ్రమైన కార్చిచ్చులు ప్రాంతంగా ఉంటోంది. మరో 7.85 శాతం చాలా ఎక్కువ కార్చిచ్చు కేటగిరి జోన్‌గా ఉంటోంది. దేశంలోని అడవులు ఎదుర్కొంటున్న పెద్ద రిస్క్‌గా ఈ జోన్‌లోని అడవులు ఉన్నాయి. ప్రజాజీవన ఆధారంగా అడవులు కీలక పాత్ర వహిస్తున్నాయి. దాదాపు 275 మిలియన్ గ్రామీణ ప్రజలు అడవులపై ఆధారపడి బతుకుతున్నారని ఐఎస్ఎఫ్ఆర్ 2023 డేటా వెల్లడించింది. అడవులకు చేరువగా నివసిస్తున్న సమాజాలు అడవుల్లోని కలపేతర ఉత్పతులపై అంటే కాయలు, గింజలు, పుట్టగొడుగులు వంటి ఉత్పత్తులపై, పర్యావరణ సేవలపైన ఆధారపడి బతుకుతున్నాయి. అయితే అటవీ వనరుల నిలువు దోపిడీ, మానవ స్వప్రయోజన అక్రమాలు రానురాను విచ్చలవిడిగా సాగుతుండటంతో అటవీ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. మధ్య, ఉత్తర, తూర్పు భారత ప్రాంతాల్లో ముఖ్యంగా తునికాకు, ఇప్పపూవుల సేకరణ కార్చిచ్చు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అవుతున్నాయి. తేనె వేటగాళ్లు అడవుల్లో ఎండుగడ్డిని తగులబెట్టడం కూడా కార్చిచ్చుకు దారి తీసిన సంఘటనలు ఉన్నాయి. గోవా, అసోం, మణిపూర్ అడవుల్లో ఈ చర్యల వల్లనే అడవులు అంటుకున్నాయని పోలీసులు తెలుసుకుని కొందరిని అరెస్టు చేశారు. దీనికి తోడు స్థానిక రైతులు తమ సాగులో పంటల మార్పిడి విధానాలు 4.35 మిలియన్ హెక్టార్ల అడవులపై విపరీత ప్రభావం చూపించి కార్చిచ్చులకు దారితీస్తున్నాయి. ఈ కార్చిచ్చులన్నీ సహజమైనవి కావనీ, రైతులు తమ పొలాలన్నీ ఖాళీ చేయడానికి పంటకోతల తరువాత మిగిలిన గడ్డిని, ఇతర వ్యర్థాలను తగులబెడుతున్నారని ఉపగ్రహాల ద్వారా కనుగొన్నట్టు గతంలో ఒడిశా అటవీ మంత్రిత్వశాఖ బయటపెట్టడం ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. సహజమైన అడవుల పర్యావరణ వ్యవస్థలో, తిరిగి నేలను సాగుకు అనువుగా వెసులుబాటు కల్పించడంలో సేంద్రియ వ్యర్థాలను తొలగించడంలో కార్చిచ్చులు కీలక పాత్ర వహిస్తున్నప్పటికీ, వీటి వ్యతిరేక ప్రభావాలు అడవులకు దక్కవలసిన ప్రయోజనాలను దూరం చేస్తున్నాయి. ఈ పరిణామాలు చివరకు జీవితాలను బలిగొంటున్నాయి. నివాసాలను విధ్వంసం చేస్తున్నాయి. అందుకనే కార్చిచ్చుల నివారణకు ఆయా ప్రభుత్వాలు నిరంతరం అప్రమత్తంగా ఉండక తప్పదు.